నేటి కందం-నేటికి అందం

అచలాత్ముని సత్ఫుపతో
నిచితములగు రోగములను నిర్మూలింపన్
ఉచితముగ వైద్య సేవలు
ప్రచలిత మొనరించినట్టి ప్రభుతను దలతున్ !!

(మారుమూల గ్రామాలలో ఉచిత వైద్య సేవలను ప్రభుత్వం ప్రజలకు అందిస్తూ ప్రయోగాత్మకంగా జమ్మూ కాశ్మీరులో అమలు చేసింది. వేలాది మంది పేద రోగులకు వైద్యం ఉచితంగా అందింది.)

-రాధశ్రీ
సెల్:9494481210



నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

చురక

జ్ఞానేషిక దిగిపొమ్మని
గర్జించెను మెగా ర్యాలి
రాంలీలా మైదానం
రగిలింది జనం వాలి.
సర్ పేరున కోట్ల ఓట్లు
చెరిపేసిన దుష్ట ఘనత
అందుకొరకే విపక్షాల
ఆందోళన నిత్య జ్వలిత.

-వేల్పుల నారాయణ
9440433475



హైదరాబాద్ మంగళవారం 3-11-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :33 సంచిక:79 పేజీలు:68 వెల: రూ.1/-

తెలంగాణలో లక్ష మంది విద్యార్థులకు ఉచిత ఏఐ, క్లౌడ్ శిక్షణ: మంత్రి శ్రీధర్ బాబు

తెలంగాణలో లక్ష మంది విద్యార్థులకు ఉచిత ఏఐ, క్లౌడ్ శిక్షణ: మంత్రి శ్రీధర్ బాబు



హైదరాబాద్, నవంబర్ 2: తెలంగాణలో లక్ష మంది విద్యార్థులకు ఉచితంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ , క్లౌడ్ కంప్యూటింగ్ శిక్షణ అందించనున్నట్లు మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. 'తెలంగాణ ఏఐ అండ్ క్లౌడ్ స్కిల్లింగ్ ఇనిషియేటివ్'లో భాగంగా అమెజాన్ వెబ్ సర్వీసెస్ సహకారంతో టాస్క్ ఆధ్వర్యంలో ఈ శిక్షణను చేపట్టనున్నట్లు చెప్పారు. ప్రభుత్వానికి, కళాశాలలకు, విద్యార్థులకు ఎలాంటి ఆర్థిక భారం లేదని.. రాష్ట్రంలోని 643 టాస్క్ అనుబంధ కళాశాలల్లో శిక్షణ అందిస్తామని వెల్లడించారు.

విద్యార్థులకు ఏఐ, డేటా ఇంజినీరింగ్, మెషిన్ లెర్నింగ్, జనరేటివ్ ఏఐలో శిక్షణ ఇవ్వనున్నట్లు మంత్రి చెప్పుకొచ్చారు. ఇంజినీరింగ్ విద్యార్థులతో పాటు ఆర్ట్స్, కామర్స్ విద్యార్థులకూ ప్రత్యేక కోర్సులను అందుబాటులో ఉంటాయన్నారు. తద్వారా ఏడాది పాటు 900కు పైగా డిజిటల్ కోర్సులను విద్యార్థులు ఉచితంగా వినియోగించుకునే అవకాశం ఉంటుందన్నారు. గ్లోబల్ సర్టిఫికేషన్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు డిస్కౌంట్ వోచర్లు అందిస్తామన్నారు. విద్యార్థులకు హ్యాకథాన్లు, ఇండస్ట్రీ కనెక్ట్ సెషన్లు నిర్వహించనున్నట్లు తెలిపారు. శిక్షణ పూర్తి చేసిన అర్హులకు ప్రత్యేక జాబ్ మేళాలు నిర్వహిస్తామన్నారు. కళాశాల అధ్యాపకులకూ ప్రపంచస్థాయి ఏఐ, క్లౌడ్ శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. లక్ష మంది యువతకు అంతర్జాతీయ స్థాయి సాంకేతిక నైపుణ్యాలను అందించడమే లక్ష్యమని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు.

తెలంగాణలో 48 ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకున్న సినీనటి మంచు లక్ష్మి

సంగారెడ్డి జిల్లా, నవంబర్ 2: గ్రామీణ విద్యార్థులకు కూడా కార్పొరేట్ స్థాయిలో విద్యను అందించాలన్నదే తన లక్ష్యమని ప్రముఖ సినీ నటి మంచు లక్ష్మి అన్నారు. ఈ మేరకు సంగారెడ్డి జిల్లాలో పర్యటిస్తున్న లక్ష్మి.. నిరుపేదల విద్యా ప్రమాణాలు పెంచేందుకు తన ట్రస్ట్ ద్వారా ఉమ్మడి మెదక్ జిల్లాలో 48 ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకున్నట్లు ప్రకటించారు.

సంగారెడ్డి జిల్లాలో పర్యటిస్తున్న మంచు లక్ష్మి.. చౌటకూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. ఈ పాఠశాలలో 'టీచ్ ఫర్ చేంజ్' ఎన్జీవో ఆధ్వర్యంలో నిర్మించిన డిజిటల్ స్మార్ట్ క్లాస్ రూమ్‌ను ప్రారంభించారు. విద్యా ప్రమాణాలు పెంచేందుకు తన ట్రస్ట్ ద్వారా ఉమ్మడి మెదక్ జిల్లాలో 48 ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకున్నట్లు ప్రకటించారు. గ్రామీణ విద్యార్థులకు కార్పొరేట్ తరహాలో విద్యను అందించాలన్నదే తన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ మేరకు గ్రామీణ ప్రాంత విద్యార్థుల కోసం పాఠశాలల్లో అత్యాధునిక సాంకేతికతో కూడిన విద్యను అందించడానికి.. స్మార్ట్ ఎల్ఈడీ టీవీలు, డిజిటల్ క్లాస్ రూమ్స్, మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు.

చర్చల నుంచి వెనుదిరిగిన ఇరాన్!

న్యూ ఢిల్లీ, నవంబర్ 2: అంతర్జాతీయ ప్రతినిధి: అమెరికాతో యుద్ధానికి ముగింపు పలికే దిశగా ఖతార్ మధ్యవర్తిత్వంలో జరుగుతున్న దౌత్య ప్రయత్నాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. అమెరికాతో ఒప్పందం కోసం జరుగుతున్న చర్చల్లో పాల్గొన్న ఇరాన్ ప్రతినిధులు దోహా నుంచి వెనుదిరిగారు. అయితే చర్చల్లో ప్రతిష్ఠంభన కారణంగా వారు వెళ్లిపోలేదని, ఒప్పందానికి సంబంధించిన ముసాయిదా ప్రతిపాదన ప్రస్తుతం వివిధ వర్గాల మధ్య చక్కర్లు కొడుతోందని చర్చల గురించి తెలిసిన ఓ అధికారి వెల్లడించారు. దీనిపై అభిప్రాయాలు సేకరించిన అనంతరం మరో విడత సమావేశం జరిగే అవకాశముందని తెలిపారు.

ఆదివారం ఇరాన్ ప్రతినిధులు దోహా నుంచి వెళ్లిపోయినట్లు సోమవారం వెల్లడైంది. మరోవైపు చర్చలు పూర్తిగా నిలిచిపోలేదని ఇరాన్ స్పష్టం చేసింది. ఖతార్ మధ్యవర్తుల ద్వారా వాషింగ్టన్‌తో సందేశాల మార్పిడి కొనసాగుతోందని ఆ దేశ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయీ తెలిపారు. దీంతో ఇరాన్ ప్రతినిధుల నిష్క్రమణపై అంతర్జాతీయంగా ఆసక్తి నెలకొంది.

అమెరికాతో చర్చలకు సెప్టెంబరులో ఇరాన్ రూపొందించిన ఏడు దశల ప్రణాళికే ప్రాతిపదికగా ఉందని బఘాయీ వెల్లడించారు. హోర్ముజ్ జలసంధిని తిరిగి తెరవడం, ఇరాన్‌పై అమెరికా విధించిన నౌకాదళ దిగ్బంధనాన్ని ఎత్తివేయడం ఈ ప్రణాళికలో ప్రధాన అంశాలు. తొలుత ఏడు రోజుల వ్యవధిలో అమలు చేయాలని భావించిన ఈ ప్రణాళికను ఇప్పుడు రెండు రోజుల్లోనే అమలు చేయగలమని ఇరాన్ ప్రతిపాదిస్తోంది.

అమెరికాతో సందేశాల మార్పిడి, చర్చల సౌలభ్యం కోసం ఇరాన్ ఉప విదేశాంగ మంత్రి కాజెమ్ ఘరీబాబాదీ దోహాలో పర్యటించారు. ఖతార్ మధ్యవర్తుల ద్వారా వాషింగ్టన్‌కు ఇరాన్ అభిప్రాయాలను చేరవేసినట్లు బఘాయీ వివరించారు. ఈ దౌత్య ప్రక్రియలో ఇరాన్ ప్రతిపాదనలే ప్రధాన చర్చనీయాంశంగా ఉన్నాయని తెలిపారు.

అమెరికా నౌకాదళ దిగ్బంధనాన్ని తొలగించకుండా, ఇరాన్ డిమాండ్లను గౌరవించకుండా తుది ఒప్పందం సాధ్యం కాదని బఘాయీ స్పష్టం చేశారు. ఇరాన్ చట్టబద్ధమైన అవసరాలను పరిష్కరించిన తర్వాతే హోర్ముజ్ జలసంధిని తిరిగి తెరవడం, అక్కడ భద్రత కల్పించడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ సైతం ఈ అంశంపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఒప్పందం కుదిరి తమ షరతులు నెరవేరితే గతంలో ప్రతిపాదించిన ఏడు రోజుల గడువుకు బదులుగా కేవలం రెండు రోజుల్లోనే హోర్ముజ్ జలసంధిని తెరిచేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. అయితే ఇరాన్ తొలుత చేసిన ప్రతిపాదనను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తిరస్కరించారు.

ఇరాన్ ప్రతిపాదన అమలుకు అమెరికా నౌకాదళ దిగ్బంధనాన్ని తొలగించడంతోపాటు తమ డిమాండ్లను అంగీకరించాలని బఘాయీ స్పష్టం చేశారు. ఈ విషయంలో వాషింగ్టన్ నుంచి వచ్చే స్పందనపైనే తదుపరి పరిణామాలు ఆధారపడి ఉంటాయని పేర్కొన్నారు.

హైదరాబాద్‌ను పరిశుభ్రమైన, ట్రాఫిక్ ఫ్రీ సిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యం: సీఎం రేవంత్



హైదరాబాద్, నవంబర్ 2 హైదరాబాద్‌ని పరిశుభ్రమైన, ట్రాఫిక్ ఫ్రీ నగరంగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. భాగ్యనగరంలో ఎక్కడా చెత్త కనిపించకూడదని అధికారులను ఆదేశించారు. ప్రతిరోజూ ఇంటింటికీ చెత్త సేకరణ జరగాల్సిందేనని తేల్చిచెప్పారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. సీఎం రేవంత్ రెడ్డి ఇవాళ (సోమవారం) మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చెత్త నిర్వహణ, ట్రాఫిక్ సమస్యలపై దిశానిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో నిర్మాణ వ్యర్థాల తరలింపునకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. వ్యర్థాల తరలింపులో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే, గ్రీన్ ట్యాంకర్ల ద్వారా శుద్ధి చేసిన నీటి సరఫరాను విస్తరించాలని సూచించారు. నిర్మాణ పనులు, పార్కులు, గ్రీనరీ నిర్వహణ వంటి అవసరాలకు శుద్ధి చేసిన నీటినే వినియోగించాలని ఆదేశించారు. జీహెచ్ఎంసీతో పాటు సీఎంసీ, ఎంఎంసీ పరిధుల్లోనూ గ్రీన్ వాటర్ సరఫరాను పెంచాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.మరోవైపు, నగరంలో ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సిగ్నల్ ఫ్రీ ట్రాఫిక్ కోసం అండర్‌పాస్‌లు, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ట్రాఫిక్ సిగ్నళ్ల వద్ద వాహనాలు నిలిచిపోవడంతో నగరవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. పక్కా ప్రణాళికలతో ఈ సమస్యకు పరిష్కారం చూపాలని అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

విమాన టికెట్ ధరలపై కేంద్రం కీలక అధికారం..

అత్యవసర పరిస్థితుల్లో ఛార్జీల నియంత్రణకు కొత్త నిబంధనలు
ఎయిర్‌లైన్స్‌కు ఆదేశాలు జారీ చేసే అధికారం కేంద్రం చేతికి

న్యూ ఢిల్లీ, నవంబర్ 2: విమాన ప్రయాణికులకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అత్యవసర పరిస్థితుల్లో విమాన టికెట్ ధరలను నియంత్రించే అధికారాన్ని కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ తన పరిధిలోకి తీసుకుంది. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అవసరమైన సందర్భాల్లో విమానయాన సంస్థలకు టికెట్ ఛార్జీల విషయంలో ఆదేశాలు జారీ చేసే వెసులుబాటును కల్పించింది. అయితే ప్రభుత్వం జారీ చేసే ఈ ఆదేశాలు నిర్దిష్ట కాలానికి మాత్రమే వర్తించనున్నాయి.

నిర్వహణ వ్యయాల ఆధారంగా ధరలు

భారతీయ వాయుయాన్ అధినియం-2026లోని నిబంధనల ప్రకారం విమానయాన సంస్థలు తమ నిర్వహణ వ్యయాలను పరిగణనలోకి తీసుకుని టికెట్ ధరలను నిర్ణయించుకోవాల్సి ఉంటుంది. ఈ ధరలకు సంబంధించిన పూర్తి వివరాలను డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ)కు సమర్పించడం తప్పనిసరి.

ప్రజా ప్రయోజనాలే ప్రాధాన్యం

నిబంధన 192 ప్రకారం విమానయాన సంస్థలు నిర్ణయించే టారిఫ్ వివరాలపై డీజీసీఏకు సమాచారం అందించాలి. అదే సమయంలో అత్యవసర పరిస్థితులు, ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన సందర్భాల్లో కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవచ్చు. అవసరాన్ని బట్టి విమానయాన సంస్థలకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేయవచ్చు. అయితే ఈ అధికారాన్ని నిర్దిష్ట కాలపరిమితిలోనే వినియోగించాల్సి ఉంటుంది. తాజా నిబంధనలతో విమాన టికెట్ ధరల విషయంలో అత్యవసర సమయాల్లో కేంద్ర ప్రభుత్వానికి మరింత నియంత్రణాధికారం లభించినట్లయింది.

ఢిల్లీలో కఠినంగా కాలుష్య నియంత్రణ చర్యలు.. ఒక్కరోజే రూ.60 లక్షల జరిమానాలు

న్యూ ఢిల్లీ, నవంబర్ 2: ఢిల్లీలో కాలుష్య నియంత్రణ చర్యలు కఠినంగా అమలు చేస్తున్నారు. నిబంధనలను ఉల్లంఘించిన వాహనాల యజమానులకు భారీగా జరిమానాలు విధించారు. వింటర్ యాక్షన్ ప్లాన్ అమల్లో భాగంగా మొదటి రోజు ఆదివారం రూ.68.4 లక్షల జరిమానా వేశారు. ఆరోజు దాదాపు 15 వేల వాహనాలను తనిఖీ చేశారు. 1539 వాహనాలను బార్డర్ పాయింట్ల తిప్పి పంపారు. పొల్యూషన్ అండర్ కంట్రోల్ సర్టిఫికెట్ (పీయూసీసీ) ఉల్లంఘనల కింద 566 చలానాలు జారీ చేశారు. ఈ మేరకు ఢిల్లీ ప్రభుత్వం ఒక నివేదికను విడుదల చేసింది.

ఆ నివేదిక ప్రకారం.. పీయూసీసీ ఉల్లంఘనలకు రూ.56.6 లక్షలు, సరిహద్దుల వద్ద ఆంక్షల ఉల్లంఘనలకు రూ.2 లక్షలు, నిబంధనలు ఉల్లంఘించి నిర్మాణాలు చేపట్టినందుకు రూ.9.8 లక్షల మేర జరిమానా వేశారు. ఆదివారం 14,930 వాహనాలను ఢిల్లీ ట్రాఫిక్ పోలీసులు, రవాణా శాఖ అధికారులు తనిఖీ చేశారు. వాటిలో 1400 వెహికల్స్‌ను వెనక్కి పంపారు. 62 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వెనక్కి పంపిన వాహనాల్లో 140 తేలికపాటివి కాగా, 54 లైట్ కమర్షియల్ వెహికల్స్, 95 హెవీ గూడ్స్ వెహికల్స్, 34 బస్సులు ఉన్నాయి. అలాగే 1423 టూ వీలర్లు, త్రీ వీలర్లను చెక్ చేసి 789 వాహనాలను వెనక్కి పంపారు. వాటిలో 38 వెహికల్స్ సీజ్ చేశారు.కాగా.. కంప్రెస్డ్ న్యాచురల్ గ్యాస్, ఎలక్ట్రిక్ వాహనాలు, అత్యవసర సర్వీసుల కోసం ఉపయోగించే వాహనాలకు ఆంక్షల నుంచి మినహాయింపు ఇచ్చారు. అలాంటివి మొత్తం 740 వెహికల్స్‌ను తనిఖీ చేసి అనుమతించారు. అలాగే పొల్యూషన్ అండర్ కంట్రోల్ సర్టిఫికెట్ లేకుండా వెహికల్స్ నడుపుతున్న యజమానులకు అధికారులు 566 చలానాలు జారీ చేశారు. రూ.56.6 లక్షల జరిమానా కూడా విధించారు. వాటిలో ఢిల్లీ పోలీసులు వేసిన చలాన్లు 493, జరిమానాలు రూ.49.3 లక్షలు ఉండగా, రవాణా శాఖ అధికారులు వేసిన చలాన్లు 73, జరిమానాలు రూ. 7.3 లక్షలు ఉన్నాయి. ఇక నిబంధనలు ఉల్లంఘించి నిర్మాణాలు చేపట్టిన యజమానులకు పర్యావరణ పరిహారం కింద రూ.9.8 లక్షల ఫైన్ వేశారు. వింటర్ యాక్షన్ ప్లాన్ ఆంక్షలు ఈనెల 1 నుంచి వచ్చే ఫిబ్రవరి 28 వరకు అమల్లో ఉంటాయి. ఢిల్లీలో వాయు కాలుష్య నియంత్రణకు వింటర్ యాక్షన్ ప్లాన్ అమలు చేస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్ వైపు దూసుకొస్తున్న మురసు తుఫాన్.. అప్రమత్తంగా ఉండాలన్న ప్రఖర్ జైన్..

అమరావతి, నవంబర్ 2పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర తుఫాన్ 'మురసు' ఆంధ్రప్రదేశ్ వైపు దూసుకొస్తోందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. నవంబర్ 2వ తేదీ అర్ధరాత్రి నుంచి నవంబర్ 3వ తేదీ తెల్లవారుజాము మధ్య ఒంగోలు సమీపంలో తుఫాన్ తీరం దాటే అవకాశం ఉందని వెల్లడించింది. గత ఆరు గంటలుగా తుఫాన్ గంటకు 14 కిలోమీటర్ల వేగంతో కదులుతోందని పేర్కొంది.

ప్రస్తుతం నెల్లూరుకు 120 కిలోమీటర్లు, కావలికి 140 కిలోమీటర్లు, తిరుపతికి 170 కిలోమీటర్లు, ఒంగోలుకు 180 కిలోమీటర్లు, బాపట్లకు 200 కిలోమీటర్ల దూరంలో తుఫాన్ కేంద్రీకృతమై ఉందని ఏపీఎస్‌డీఎంఏ తెలిపింది. ఈ మేరకు సోమవారం మధ్యాహ్నం 1:30 గంటలకు తుఫాన్ వివరాలతో బులెటిన్‌ను విడుదల చేసింది. మురసు ప్రభావంతో ఏపీలోని దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆ సంస్థ తెలిపింది. అలాగే, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. దక్షిణ కోస్తా, రాయలసీమలోని ఇతర జిల్లాల్లోనూ అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయని ఏపీఎస్‌డీఎంఏ పేర్కొంది.

ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఏపీఎస్‌డీఎంఏ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ సూచించారు. తుఫాన్ తీరం దాటే సమయంలో అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావద్దని, అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని హెచ్చరించారు. మరోవైపు, తుఫాన్ తీరానికి చేరువయ్యే కొద్దీ వాతావరణ పరిస్థితులు మరింత తీవ్రంగా మారే అవకాశం ఉండటంతో, కూటమి ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు.

హైదరాబాద్ మెట్రో ఫేజ్-2కు రూ.150 కోట్ల నిధుల మంజూరు

హైదరాబాద్, నవంబర్ 2: నగర వాసులకు రాష్ట్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. హైదరాబాద్ మెట్రో ఫేజ్-2 కోసం రూ.150 కోట్ల నిధులు విడుదల చేసింది. రుణం రూపంలో నిధుల విడుదలకు పాలనాపరమైన అనుమతులు మంజూరు చేసింది. 2026-27 బడ్జెట్‌లో మెట్రోకు ప్రభుత్వం రూ.500 కోట్లు కేటాయించిన సంగతి తెలిసిందే. ఇందులో తొలి విడతగా రూ.125 కోట్ల నిధుల మంజూరుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు జీవో ఆర్టీ నెం.990 జారీ చేసింది. అలాగే ప్రతి నెలా నిధుల వినియోగంపై నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించింది.

ప్రభుత్వం విడుదల చేసిన ఈ నిధులతో మెట్రో విస్తరణ పనులు వేగవంతం కానున్నాయి. హైదరాబాద్ మెట్రో ఫేజ్-2లో భాగంగా నాగోల్-శంషాబాద్ ఎయిర్‌పోర్టు, రాయదుర్గ్-కోకాపేట్, ఎంజీబీఎస్-చాంద్రాయణగుట్ట, మియాపూర్-పటాన్‌చెరు, ఎల్‌బీనగర్ - హయత్‌నగర్ కారిడర్లు నిర్మించాలని ప్రభుత్వం ప్రతిపాదనలు చేసింది. అలాగే శంషాబాద్ ఎయిర్‌పోర్టు-భారత్ ఫ్యూచర్‌సిటీ, జేబీఎస్-మేడ్చల్, జేబీఎస్ - శామీర్‌పేట్ కారిడర్ల నిర్మాణం చేపట్టాలని ప్రతిపాదించింది.

ఢిల్లీలో గ్రీన్ క్రాకర్స్ కాల్చేందుకు సుప్రీంకోర్టు అనుమతి

న్యూఢిల్లీ, నవంబర్ 2 దీపావళి నేపథ్యంలో న్యూఢిల్లీలో పర్యావరణ హిత గ్రీన్ క్రాకర్స్‌ను కాల్చేందుకు సుప్రీంకోర్టు తాజాగా అనుమతించింది. నవంబర్ 7, నవంబర్ 8 తేదీల్లో గ్రీన్ క్రాకర్స్‌కు అనుమతిస్తూ జస్టిస్ ఎంఎం సుందరేశ్ నేతృత్వంలోని ధర్మాసనం తాజాగా ఆదేశాలు జారీ చేసింది. ఆ రెండు రోజుల్లో ఉదయం 6 - 7 గంటల మధ్య, మళ్లీ రాత్రి 8 గంటల నుంచి 10 గంటల మధ్య మాత్రమే ఈ టపాసులను కాల్చేందుకు అనుమతిస్తూ సోమవారం ఆదేశాలు జారీ చేసింది.

ఈ అంశంపై గతవారం సుప్రీంకోర్టు విచారణ జరిపింది. పూర్తిస్థాయి నిషేధం విధించేందుకు నిరాకరించింది. నిబంధనలను అమలు చేయాల్సిన బాధ్యత అధికారులదేనని కూడా సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. పదే పదే మార్గదర్శకాలు జారీ చేసినంత మాత్రాన ప్రయోజనం ఉండదని, హాస్యాస్పదంగా మారుతుందని పేర్కొంది. 'ప్రజల సెంటీమెంట్స్‌ను అర్థం చేసుకున్నాము. పూర్తిస్థాయి నిషేధం విధించలేము. కానీ ఆ స్థాయి కఠిన నిర్ణయాలు తీసుకునే పరిస్థితి సృష్టించవద్దు' అని కేంద్రం తరఫున వాదనలు వినిపించిన అడిషనల్ సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటీకి కోర్టు స్పష్టం చేసింది.

టపాసుల నియంత్రణ కోసం ప్రతి ఒక్కరి సహకారం అవసరమని ఈ సందర్భంగా కోర్టు అభిప్రాయపడింది. టపాసుల విషయంలో అవగాహన కల్పించేందుకు ప్రముఖ క్రీడాకారులు, సెలబ్రిటీల సాయం తీసుకోవాలని కూడా సూచించింది. టపాసుల వల్ల పర్యావరణానికి కలిగే నష్టం, తలెత్తే అనారోగ్యాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొంది.

తల్లి, భార్య, ఇద్దరు పిల్లలను చంపి.. రైలు ముందు దూకి వ్యక్తి ఆత్మహత్య

నవంబర్ 2:ఒక వ్యక్తి తన తల్లి, భార్య, ఇద్దరు పిల్లలను హత్య చేశాడు. ఆ తర్వాత రైలు పట్టాల వద్దకు వెళ్లాడు. రైలు ముందు దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు మరణించడంపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. (ఈతిలవ గాట ం ఈజీఎతిశ్రీఎ ఈనీబీనిట ఆవజీట) మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో ఈ సంఘటన జరిగింది. సోమవారం ఉదయం ఛోలా ప్రాంతంలోని ఒక ఇంట్లో ఇద్దరు మహిళలు, ఇద్దరు పిల్లలు విగతజీవులుగా కనిపించారు. రైలు పట్టాల వద్ద ఒక వ్యక్తి మృతదేహం లభించింది. ఆ ఐదుగురూ ఒకే కుటుంబానికి చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. 35 ఏళ్ల నరేంద్ర సాహు తన తల్లి అయిన 55 ఏళ్ల సరస్వతి, 29 ఏళ్ల భార్య సోమలత, పదేళ్ల కుమార్తె కృతి, ఆరేళ్ల కుమారుడు ఖుష్‌ను ఇంట్లో చంపినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఆ తర్వాత ఇంటి నుంచి బయటకు వెళ్లిన అతడు, రైలు పట్టాల వద్ద రైలు ముందు దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు భావిస్తున్నారు.

కాగా, ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురి మృతదేహాలను పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి పోలీసులు తరలించారు. వారి మరణంపై కేసు నమోదు చేశారు. నరేంద్ర తన కుటుంబ సభ్యులను చంపి ఆత్మహత్యకు పాల్పడటానికి కారణం ఏమిటన్నది దర్యాప్తు చేస్తున్నారు. ఈ సంఘటనకు ముందు ఆ ఇంట్లో ఏం జరిగిందో అన్నది తేలిన తర్వాత మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశమున్నదని పోలీస్ అధికారి తెలిపారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

సామాజిక సానుకూల మార్పులకు దోహదపడుతున్న జీవావరణ నిల్వలు

(03 నవంబర్ : "అంతర్జాతీయ జీవావరణ నిల్వల దినం" సందర్భంగా)

జీవుల ఉనికి ఉన్న భూమి ఉపరితలం, పైన ఉన్న గాలి, భూమి లోపలి భాగాలు కలిగిన భూభాగ ప్రాంతాన్ని "జీవావరణం లేదా బయోస్ఫియర్" అని పిలుస్తాం. నేలపై ఉన్న మట్టి, జలం, గాలి కలిసిన పొర కలిగిన ప్రదేశంలో జీవులు మనుగడ సాగిస్తాయి. సూక్ష్మ జీవుల నుంచి అతి పెద్ద జంతువులు, వృక్షాల వరకు అనేక రకాల జీవరాసులు కలిగిన ప్రదేశమే జీవావరణంగా పేర్కొనబడుతుంది. అతి ముఖ్యమైన వనరులకు జీవావరణం ఆలవాలంగా నిలుస్తున్నది. జీవావరణం ద్వారా ఆహారం, ఔషధాలు, నిర్మాణ వస్తువులు, ఇంధనాలు లభిస్తాయి. ఒక్క ఉప్పు తప్ప మిగిలిన అన్ని రకాల ఆహార పదార్థాలు జీవావరణం నుంచే లభిస్తాయి. పర్యావరణంలో జీవావరణం(బయోస్ఫియర్)తో పాటు జలావరణం(హైడ్రోస్ఫియర్), శిలావరణం (లిథోస్ఫియర్), వాతావరణం(అట్మాస్ఫియర్) అనబడే నాలుగు విభాగాలు ఉంటాయి.

అంతర్జాతీయ జీవావరణ నిల్వల దినం-2026 ఇతివృత్తం:

యునెస్కో చొరవతో 2022లో తీసుకున్న నిర్ణయం ప్రకారం ప్రతి ఏట 03 నవంబర్ రోజున ప్రపంచవ్యాప్తంగా "అంతర్జాతీయ జీవావరణ నిల్వల దినం (ఇంటర్నేషనల్ డే ఫర్ బయోస్ఫియర్ రిజర్వ్స్)" పాటించుట ఆనవాయితీగా మారింది. 2026 ఇతివృత్తంగా "జీవావరణ నిల్వలతో సామాజిక మార్పులు : స్థానిక ఆర్థిక వ్యవస్థలను అనుసంధానం చేయడం, జీవనోపాధులు, వాతావరణ సానుకూలతలు" అను అంశాన్ని తీసుకొని కోల్పోయిన జీవ వైవిధ్యాన్ని పునఃప్రతిష్టాపన చేయడానికి పథక రచన, అమలుకు పూనుకోవడం తక్షణ అవసరంగా భావించాలి. జీవ వైవిధ్యానికి నెలవులుగా "జీవావరణ నిల్వలు లేదా బయోస్ఫియర్ రిజర్వ్స్(బిఆర్)" సేవలు అందిస్తున్నాయి. పలు రకాల జంతువులు, వృక్షాలకు చిరునామాలుగా జీవావరణ నిల్వలు పని చేస్తున్నాయి. మానవాళికి ఆర్థిక, సామాజిక సుస్థిరాభివృద్ధితో పాటు అరుదైన జీవరాశులను, అంతరించే దశలో ఉన్న జీవులను కాపాడడానికి జీవావరణ నిల్వలు ఉపకరిస్తున్నాయి. బయోస్ఫియర్ రిజర్వ్స్ ద్వారా అన్ని రకాల జీవజాతుల పరిరక్షణ, భూభాగాలను కాపాడడం, మానవుల కదలికలు, జీవవ్యవస్థలు, పర్యవేక్షణ, శిక్షణలు, విద్య లాంటి ప్రయోజనాలు ఉన్నాయి.

భారత్‌లో జీవావరణ నిల్వలు:

ప్రపంచవ్యాప్తంగా 136 దేశాల్లో 759 జీవావరణ నిల్వలతో 74.42 లక్షల చదరపు కిమీ విస్తీర్ణంలో విస్తరించగా ఆయా ప్రాంతాల్లో 275 మిలియన్ల ప్రజలు నివసిస్తున్నారు. ఇండియాలో 60,000 చదరపు కిమీ విస్తీర్ణంలో 18 బయోస్ఫియర్ రిజర్వ్స్ ఉన్నాయి. ఈ 18 జీవావరణ నిల్వల్లో 13 మాత్రమే ''మ్యాన్ అండ్ బయోస్ఫియర్ ప్రోగ్రామ్(ఎంఏబి)'' అంతర్జాతీయ గుర్తింపును పొందాయి. వీటిలో ముఖ్యమైనవి నీలగిరి ప్రాంత రిజర్వ్, గల్ఫ్ ఆఫ్ మున్నార్, సుందర్‌బన్, నందా దేవి, నొక్రెక్, పచ్‌మర్హి, సిమిలిపాల్, అతనక్మార్, గ్రేట్ నికోబార్, అగస్త్యమాల, కంచన్ జోంగా, పన్నా అనబడేవి ఉన్నాయి. జీవావరణ నిల్వలతో జీవ వైవిధ్యం/జీవ వ్యవస్థలు కాపాడబడడం, సాంస్కృతిక వారసత్వం కాపాడడం, సమాజ సుస్థిరాభివృద్ధికి ఊతం ఇవ్వడం, స్థానిక ప్రజల జీవనశైలిని మెరుగుపరుచుకోవడం, అంతర్జాతీయ యంత్రాగం ఏర్పాటు చేయడం, శాస్త్రీయ పరిశోధనలు చేయడం, వాతావరణ సానుకూల మార్పులు, పర్యవేక్షణ, విద్య, శిక్షణ లాంటి ప్రయోజనాలు ఉన్నాయి.జీవావరణ నిల్వల్లో కోర్ ఏరియా, బఫర్ జోన్, ట్రాన్సిషన్ ఏరియా అను మూడు భాగాలు ఉన్నాయి.

భవిష్యత్తు తరాలను దృష్టిలో ఉంచుకొని జీవ వైవిధ్యంతో పాటు సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించడంలో బిఆర్‌ల ప్రాధాన్యాన్ని గుర్తించి "కున్మింగ్ - మాంట్రియేల్ గ్లోబల్ బిఆర్ ఫ్రేమ్‌వర్క్" నిర్దేశిత లక్ష్యాల సాధనలో ప్రభుత్వాలు, పౌర సమాజం, ఎన్‌జిఓలు ముందడుగు వేయాలి. బిఆర్ ప్రాంత ప్రజల భూమి హక్కులను కాపాడడం, మరి కొన్ని ప్రాంతాలను బిఆర్‌లుగా ప్రకటించి కాపాడడం, ఈ ప్రాంతాల్లో అక్రమాలకు పాల్పడే వ్యక్తులను కట్టడి చేయడం నిరంతరం జరగాలి.

జీవకోటిలో ఓ చిన్న భాగం మానవాళి అని, అన్ని జీవజాతులు ఉంటేనే మానవుడి మనుగడని గమనించి రేపటి ఆరోగ్యకర భవిత కోసం నేటి నుంచే జాగ్రత్త పడదాం, మనల్ని మనమే రక్షించుకుందాం.



-మధుపాళీ
9949700037

గుజరాత్‌లోని ఏక్తానగర్‌లో జరుగుతున్న భారత్ పర్వ్-2026లో సీ-సీఐసీ పెవిలియన్‌ను సందర్శించిన ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, నవంబర్ 2:గుజరాత్‌లోని ఏక్తానగర్ కేవడియాలో జరుగుతున్న భారత్ పర్వ్-2026లో జౌళి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ సెంట్రల్ కాటేజ్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (సీసీఐసీ) పాల్గొంటోంది. అక్టోబర్ 30, 2026న గౌరవ ప్రధానమంత్రి ఏక్తానగర్‌లోని సీసీఐసీ పెవిలియన్‌ను సందర్శించటం సీసీఐసీకి ఎంతో గర్వకారణమైన, చిరస్మరణీయ క్షణంగా నిలిచింది. ఈ సందర్శన ద్వారా సీసీఐసీ గొప్ప వారసత్వాన్ని, చేనేత-చేతివృత్తుల వారితో సుదీర్ఘ అనుబంధాన్ని, భారతదేశ సంప్రదాయ చేనేత, హస్తకళల వైవిధ్యాన్ని ప్రోత్సహించేందుకు చేస్తున్న నిరంతర కృషిని ప్రదర్శించేందుకు అవకాశం లభించింది.

చేనేత కార్మికులు, హస్తకళాకారులకు మెరుగైన మార్కెట్ అవకాశాలను, స్థిరమైన ఉపాధి మార్గాలను కల్పించటం ద్వారా ఆర్థికంగా శక్తిమంతులను చేయటంలో సీసీఐసీ ప్రయాణాన్ని ఈ పెవిలియన్ తెలియజేస్తుంది. భారతదేశ సంప్రదాయ హస్తకళలను దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లతో అనుసంధానించటం ద్వారా 'వోకల్ ఫర్ లోకల్' నినాదానికి, 'లోకల్ టు గ్లోబల్' దార్శనికతకు సీసీఐసీ సహకారాన్ని అందిస్తోంది.

ఈ పెవిలియన్‌లో సీసీఐసీ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ బిమల్ గోపాలాచారి, కార్పొరేషన్ అధికారులు, హస్తకళాకారులు, చేనేత కార్మికులు పాల్గొన్నారు. ఈ పెవిలియన్‌లో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారుల అద్భుతమైన నైపుణ్యాలు కనిపిస్తాయి. ముఖ్యంగా గుజరాత్ కళాకారులు అగేట్ రాళ్లు, రత్నాలతో చేసే సంప్రదాయ కళను, అందమైన అప్లిక్ పనితనాన్ని ప్రత్యక్షంగా ప్రదర్శిస్తున్నారు.

భారత చేనేత, హస్తకళల గొప్ప, వైవిధ్యభరితమైన వారసత్వాన్ని సీసీఐసీ ఘనంగా చాటుతోంది. దేశం నలుమూలల నుంచి అసాధారణమైన కళాత్మకత, సృజనాత్మకత, నైపుణ్యాన్ని ఒకే వేదికపైకి తెస్తున్న ఈ ప్రదర్శన... భారతదేశ సజీవ సాంస్కృతిక వారసత్వాన్ని, స్వదేశీ కళారూపాల కాలాతీత అందాలను ప్రతిబింబించే పలు సంప్రదాయ, చేతివృత్తుల ఉత్పత్తులను ప్రదర్శిస్తోంది. గుజరాత్‌లోని కేవడియా ఏక్తానగర్‌లో నవంబర్ 15, 2026 వరకు ఈ ప్రదర్శన అందుబాటులో ఉంటుంది.

లీజు పేరుతో రైతులకు టోకరా..

ఫైనాన్స్ కిస్తీలు తామే చెల్లిస్తామంటూ నమ్మించి వాహనాల తరలింపు
మహారాష్ట్రకు ట్రాక్టర్ల అక్రమ రవాణా.. ఆరు ట్రాక్టర్లు స్వాధీనం
నలుగురు అరెస్టు.. ఒక్కో ట్రాక్టర్‌కు రూ. 10 వేల చొప్పున కమిషన్



ఆదిలాబాద్, నవంబర్ 2: ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న రైతులే లక్ష్యంగా ట్రాక్టర్ల లీజు పేరుతో మోసాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠా గుట్టును ఆదిలాబాద్ పోలీసులు రట్టు చేశారు. ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థల నుంచి రుణాలు తీసుకుని వాయిదాలు చెల్లించలేని పరిస్థితుల్లో ఉన్న రైతులను గుర్తించి, వారి ట్రాక్టర్లను లీజుకు తీసుకుంటామంటూ నమ్మించి మహారాష్ట్రకు తరలిస్తున్న ముఠా ఆటకట్టించారు. ఈ వ్యవహారంలో ఆరు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని, నిందితులను అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదివారం వెల్లడించారు.

ప్రాథమిక విచారణలో భాగంగా ఇంద్రవెల్లి మండలంలో నాలుగు, బేలా మండలంలో మూడు, ఉట్నూర్ మండలంలో ఒకటి, తానూర్ మండలంలో ఒకటి.. మొత్తం తొమ్మిది ట్రాక్టర్లను ఈ ముఠా తరలించినట్లు గుర్తించారు. ఈ వ్యవహారంలో స్థానికంగా కొందరు వ్యక్తులు మధ్యవర్తులుగా వ్యవహరిస్తూ రైతులను నమ్మించి ట్రాక్టర్లను అప్పగించేలా చేసినట్లు పోలీసులు తెలిపారు.

ట్రాక్టర్లను ముఠాకు అప్పగించేలా చేసిన స్థానిక మధ్యవర్తులకు ఒక్కో వాహనానికి రూ. 10 వేల చొప్పున కమిషన్ చెల్లించినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. ఈ అక్రమ రవాణా వెనుక ఉన్న ఇతర వ్యక్తుల పాత్రపైనా పోలీసులు దృష్టి సారించారు.

జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆధ్వర్యంలో రెండు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. ఒక బృందం మహారాష్ట్రలోని అమరావతికి వెళ్లి ఐదు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకోగా, మరో బృందం చిక్లీ ప్రాంతంలో ఒక ట్రాక్టర్‌ను గుర్తించి స్వాధీనం చేసుకుంది. మొత్తంగా ఆరు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్పీ వివరించారు.

ఈ కేసులో అమరావతికి చెందిన ప్రధాన నిందితుడు యోగేష్‌తో పాటు ఇంద్రవెల్లి మండలానికి చెందిన కుమ్మరి శ్యాంరావు, వాగుమారి కేశవ్, గట్టేపల్లికి చెందిన పీతాంబర్, నర్సాపూర్‌కు చెందిన అంబరావును అరెస్టు చేసినట్లు పోలీసు వివరాల్లో పేర్కొన్నారు. నిందితుల నుంచి ఆరు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ఫైనాన్స్ వాయిదాలు చెల్లించలేని పరిస్థితుల్లో ఉన్న ట్రాక్టర్ యజమానులు లీజు పేరుతో పరిచయం లేని వ్యక్తులను నమ్మి తమ వాహనాలను అప్పగించవద్దని ఎస్పీ సూచించారు. అమాయక రైతులను లక్ష్యంగా చేసుకుని మోసాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తరహా మోసాలకు గురైన బాధితులు ఎవరైనా ఉంటే నిర్భయంగా జిల్లా పోలీసులను సంప్రదించాలని, వారికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

ఈ మీడియా సమావేశంలో ఉట్నూర్ ఏఎస్పీ రుత్విక్ సాయి కొట్టే (ఐపీఎస్), ఉట్నూర్ సీఐ ఎం. ప్రసాద్, ఇంద్రవెల్లి ఎస్ఐ ఈ. సాయన్న పాల్గొన్నారు.

మై భారత్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ప్రగతి మహావిద్యాలయలో నైబర్‌హుడ్ యూత్ పార్లమెంట్, వికసిత్ భారత్ యువ సంవాద్ నిర్వహణ

న్యూ ఢిల్లీ, నవంబర్ 2: హైదరా బాద్‌లోని మేరా యువ భారత్ ఆధ్వర్యంలో ప్రగతి మహావిద్యాలయలో అక్టోబర్ 31, 2026న "నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్" అంశంపై నైబర్‌హుడ్ యూత్ పార్లమెంట్, "నో యువర్ వోట్" అంశంపై వికసిత్ భారత్ యువ సంవాద్ కార్యక్రమాలు నిర్వహించారు.

రాష్ట్రీయ ఏక్తా దివాస్ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించటంతో ఈ కార్యక్రమం ప్రారంభమైంది. ప్రగతి మహావిద్యాలయ ప్రిన్సిపల్ డాక్టర్ మాధవి లత ప్రారంభోపన్యాసం చేస్తూ... దేశ నిర్మాణంలో యువత భాగస్వామ్య ప్రాముఖ్యతను స్పష్టం చేశారు.

మై భారత్ హైదరాబాద్ జిల్లా యువజన అధికారి (ఇన్‌చార్జ్) శ్రీ గంటా రాజేష్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. దీనిద్వారా మై భారత్ ప్రత్యేకతను తెలియజేశారు. వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ చర్చల ఉద్దేశాలను, ప్రాముఖ్యతను వివరించారు.

''నో యువర్ వోట్'' అంశంపై యువ ఐకాన్ శ్రీ జి. కార్తీక్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. ఎన్నికల గురించిన అవగాహన, బాధ్యతాయుతమైన ఓటింగ్, ప్రజాస్వామ్య ప్రక్రియలో క్రియాశీలక భాగస్వామ్యాల ప్రాముఖ్యతను తెలిపారు.'నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్" అంశంపై నిపుణులు ప్రసంగించారు. మాదకద్రవ్యాల దుర్వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించి, ఆరోగ్య కరమైన, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావా లని యువతను ప్రోత్సహించారు.

కార్యక్రమంలో భాగంగా నషా ముక్త్ భారత్ ప్రతిజ్ఞ, లోకతాంత్రిక్ ప్రతిజ్ఞను శ్రీ మనోజ్ ఖన్నా చేయించారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, ప్రజాస్వామ్య విలువ లను కాపాడుకోవాలని, పౌర బా ధ్యతలను నిర్వర్తించాలని యువ తకు పిలుపునిచ్చారు. ప్రజా స్వామ్య హక్కులు, బాధ్యతలపై యువతకు అవగా హన కల్పించ టం, డ్రగ్స్ రహిత జీవనశైలిని ప్రోత్సహించటం, వికసిత్ భారత్ లక్ష్య సాధనలో క్రియాశీలకంగా పాల్గొనేలా యువతను ఉత్సాహ పరచటమే ఈ కార్యక్రమ ఉద్దేశం.

పత్తి దిగుమతులపై కస్టమ్స్ సుంకం మినహాయింపును డిసెంబర్ 31 వరకు పొడిగించిన కేంద్ర ప్రభుత్వం

న్యూఢిల్లీ, నవంబర్ 2దేశీయ జౌళి పరిశ్రమకు అవసరమైన ముడినరుకు లభ్యతను దృష్టిలో ఉంచుకుని, పత్తి దిగుమతులపై ప్రస్తుతం అమల్లో ఉన్న కస్టమ్స్ సుంకం మినహాయింపును 2026 డిసెంబర్ 31 వరకు భారత ప్రభుత్వం పొడిగించింది.

ఈ పొడిగింపునకు సంబంధించి కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలోని రెవెన్యూ విభాగం 2026 అక్టోబర్ 30న నోటిఫికేషన్ నంబర్ 35/2026-కస్టమ్స్ జారీ చేసింది. ఈ సవరణ ద్వారా 2026 అక్టోబర్ 31 వరకు అందుబాటులో ఉన్న సుంకం మినహాయింపును మరో రెండు నెలలు, అంటే డిసెంబర్ 31 వరకు పొడిగించారు.

దేశీయ వస్త్ర రంగానికి పత్తి లభ్యతను పెంచడం, ప్రత్యేక అవసరాలకు అనుగుణమైన పత్తి సరఫరాను అందుబాటులో ఉంచడం, జౌళి, దుస్తుల తయారీ ప్రక్రియలో వివిధ దశల్లో అదనపు విలువను పెంచేందుకు తోడ్పడటం ఈ నిర్ణయం ప్రధాన ఉద్దేశం.

ఈ చర్య వల్ల వస్త్రాలు, దుస్తుల తయారీదారులు తమ ముడినరుకు అవసరాలను తీర్చుకోవడంలో మరింత వెసులుబాటు లభిస్తుందని, ఉత్పత్తి వ్యయంపై ఒత్తిడి తగ్గుతుందని అంచనా. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు (ఎంఎస్ఎంఈలు) మద్దతు లభించడంతో పాటు, దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో భారత జౌళి పరిశ్రమ పోటీతత్వం బలోపేతం కానుంది.

ఈ పొడిగింపు ద్వారా ముడిసరుకు సరఫరాలో అంతరాయాలు లేకుండా చూడటానికి, వస్త్ర పరిశ్రమ కార్యకలాపాల్లో సౌలభ్యాన్ని పెంచడానికి, పత్తి ఆధారిత వస్త్రాలు, దుస్తుల రంగంలో మరింత అదనపు విలువను సృష్టించడానికి వీలవుతుందని భావిస్తున్నారు.పోటీతత్వం కలిగిన, ఒడిదొడుకులను తట్టుకోగలిగే, ప్రపంచ మార్కెట్లతో అనుసంధానమైన వస్త్ర రంగాన్ని ప్రోత్సహించడం, అదనపు విలువ సృష్టి, ఉపాధి కల్పనను పెంపొందించడం, మొత్తం వస్త్ర తయారీ విలువ గొలుసు దీర్ఘకాలిక వృద్ధికి తోడ్పడటానికి వస్త్ర మంత్రిత్వ శాఖ కట్టుబడి ఉంది.

కొమురం సూరు ఆశయ సాధనకు కృషి చేయాలి

గిరిజనుల హక్కుల కోసం ఆయన చేసిన పోరాటం స్ఫూర్తిదాయకం
ఈ నెల 4న 29వ వర్ధంతి కార్యక్రమం
వర్ధంతి పోస్టర్లను ఆవిష్కరించిన బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రితీష్ రాథోడ్



ఆదిలాబాద్, అక్టోబర్ 31: నిజాం కాలంలో కొమురం భీమ్ అనుచరుడిగా ఉంటూ గిరిజనుల హక్కుల కోసం పోరాడిన కొమురం సూరు ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రితీష్ రాథోడ్ కోరారు. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలం దంతన్‌వల్లి పంచాయతీ పరిధిలోని కోలాం గూడలో ఈ నెల 4న బుధవారం మధ్యాహ్నం 1.15 గంటలకు నిర్వహించనున్న కొమురం సూరు 29వ వర్ధంతి కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను సోమవారం తన నివాసంలో పార్టీ నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా కొమురం సూరు అనాటి కాలంలో గిరిజనుల హక్కుల కోసం చేసిన పోరాటాన్ని, త్యాగాలను స్మరించుకున్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఉట్నూర్ మండల అధ్యక్షుడు బింగి వెంకటేష్, ఓబీసీ ఖానాపూర్ నియోజకవర్గ కన్వీనర్ నీవతి లింగాగౌడ్, కోలాం సంఘం నాయకులు భీమ్‌రావు, బాపురావు తదితరులు పాల్గొన్నారు.

భారత వైమానిక దళాధిపతిగా బాధ్యతల స్వీకరించిన ఎయిర్ చీఫ్ మార్షల్ అశుతోష్ దీక్షిత్

న్యూఢిల్లీ, నవంబర్ 2ఎయిర్ చీఫ్ మార్షల్ అశుతోష్ దీక్షిత్ (పీవీఎస్ఎం, ఏవీఎస్ఎం, వీఎం, వీఎస్ఎం) 2026 అక్టోబర్ 31న భారత వైమానిక దళానికి 29వ అధిపతిగా బాధ్యతలు స్వీకరించారు. దేశానికి 42 ఏళ్ల విశిష్ట సేవల అనంతరం పదవీ విరమణ చేసిన ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ (పీవీఎస్ఎం, ఏవీఎస్ఎం) స్థానంలో ఆయన బాధ్యతలు చేపట్టారు.

జాతీయ రక్షణ అకాడమీ (ఎన్‌డీఏ) పూర్వ విద్యార్థి అయిన ఎయిర్ చీఫ్ మార్షల్ అశుతోష్ దీక్షిత్ 1986 డిసెంబర్ 6న భారత వైమానిక దళంలోని ఫైటర్ విభాగంలో అధికారిగా నియమితులయ్యారు.

నాలుగు దశాబ్దాల సుదీర్ఘ కెరీర్‌లో ఆయనకు కార్యాచరణ, విమాన పరీక్షలు, సైనిక సామర్థ్యాల అభివృద్ధి, త్రివిధ దళాల సమన్వయ విభాగాల్లో విస్తృత అనుభవం ఉంది. సమర్థవంతమైన ఫైటర్ పైలట్, అర్హత పొందిన ఫ్లయింగ్ ఇన్‌స్ట్రక్టర్, ప్రయోగాత్మక విమాన పరీక్షా పైలట్‌గా గుర్తింపు పొందారు. ఆయనకు మిరాజ్-2000, వివిధ మిగ్ రకాలు, జాగ్వార్, పలు రవాణా విమానాలతో సహా అనేక రకాల విమానాల్లో 3,300 గంటలకు పైగా ప్రయాణించిన అనుభవం ఉంది.

భారత వైమానిక దళ ఆధునికీకరణలో ఆయన చేసిన కృషి విశేష గుర్తింపు పొందింది. జాగ్వార్, మిగ్-27 విమానాల ఆధునికీకరణ ప్రాజెక్టులను ఖరారు చేయడంలో, తేలికపాటి యుద్ధ విమానం (ఎల్‌సీఏ) ఎంకే-1 తేజస్‌కు సంబంధించి ప్రారంభ కార్యాచరణ అనుమతి (ఐఓసీ), తుది కార్యాచరణ అనుమతి (ఎఫ్ఓసీ) ప్రక్రియలను పూర్తి చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. మిరాజ్-2000 స్క్వాడ్రన్, పశ్చిమ ప్రాంతంలోని ఫార్వర్డ్ బేస్ సపోర్ట్ యూనిట్, వైమానిక దళంలోని కీలక ఫైటర్ శిక్షణ కేంద్రం అయిన బీదర్ ఎయిర్ ఫోర్స్ స్టేషన్‌కు ఆయన కార్యాచరణ కమాండర్‌గా బాధ్యతలు నిర్వహించారు.

వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, సీఏపీఎఫ్‌లు, సీపీఓలకు చెందిన 490 మంది సిబ్బందికి 2026 సంవత్సరానికి 'కేంద్ర గృహమంత్రి దక్షత పతకం' ప్రదానం

న్యూఢిల్లీ, నవంబర్ 2 వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, కేంద్ర సాయుధ పోలీసు బలగాలు (సీఏపీఎఫ్‌లు), కేంద్ర పోలీసు సంస్థలకు (సీపీఓలు) చెందిన 490 మంది సిబ్బందికి 2026 సంవత్సరానికి 'కేంద్ర గృహమంత్రి దక్షత పతకం' ప్రదానం చేశారు. అత్యుత్తమ పనితీరును గుర్తించడం, ఉన్నత వృత్తిపరమైన ప్రమాణాలను ప్రోత్సహించడం, సంబంధిత అధికారులు, సిబ్బంది మనోధైర్యాన్ని పెంపొందించడం ఈ పతకం లక్ష్యం.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో, కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా మార్గదర్శకత్వంలో ప్రారంభించిన 'కేంద్ర గృహమంత్రి దక్షత పతకం' పోలీసు సిబ్బంది అందరి మనోధైర్యాన్ని మరింత పెంపొందిస్తుంది.

కేంద్ర హోం మంత్రిత్వ శాఖ 2024 ఫిబ్రవరి 1న జారీ చేసిన నోటిఫికేషన్ ద్వారా ఈ పతకాన్ని ఏర్పాటు చేసింది. దేశవ్యాప్తంగా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన పోలీసు బలగాలు, భద్రతా సంస్థలు, నిఘా విభాగాలు, ప్రత్యేక శాఖలు, కేంద్ర పోలీసు సంస్థలు (సీపీఓలు), కేంద్ర సాయుధ పోలీసు బలగాలు (సీఏపీఎఫ్‌లు), జాతీయ భద్రతా దళం (ఎన్ఎస్‌జీ), అస్సాం రైఫిల్స్ సిబ్బందికి ఈ పతకాన్ని ప్రదానం చేస్తారు. అలాగే ఫోరెన్సిక్ సైన్స్ రంగంలో (కేంద్ర, రాష్ట్ర, కేంద్రపాలిత ప్రాంతాల స్థాయిలో) విశేష ప్రతిభ కనబరిచిన ప్రభుత్వ శాస్త్రవేత్తలకు ఈ పతకం అందజేస్తారు.

కరువు రైతుకు ఓదార్పు..!



ఆదిలాబాద్, నవంబర్ 2: కాలం కలిసి రాక.. పంట దిగుబడి చేతికి రాక కరువు రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. ఉమ్మడి అదిలాబాద్ జిల్లాలో 45 మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించగా, ఒక ఆదిలాబాద్ జిల్లాలోనే 20 మండలాలను ప్రభుత్వం కరువు ప్రాంతాలుగా గుర్తించింది. తెల్ల బంగారం పంట సాగు చేసి తెల్లబోయిన రైతులు అప్పుల భారంతో ఆత్మహత్యల బాట పట్టారు. నెల రోజుల వ్యవధిలోనే ఆదిలాబాద్ జిల్లాలో 12 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. ఎకరాకు 8 క్వింటాళ్ల పత్తి దిగుబడి రావాల్సిన రైతుకు రెండు నుండి మూడు కుంటాల దిగుబడి మాత్రమే వచ్చింది. మార్కెట్లో రోజుకు ధరలు పడిపోతూ రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఈ నేపథ్యంలో కరువు రైతులకు అండగా ఉండేందుకు, ఆత్మహత్యలు చేసుకున్న కుటుంబాలను ఓదార్చేందుకు రైతు గర్జన పేరిట మాజీ మంత్రి బి ఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని డైట్ మైదానంలో జరిగే రైతు గర్జన బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. ఈ మేరకు అదిలాబాద్ జిల్లా నుండి భారీ ఎత్తున జన సమీకరణకు మాజీ మంత్రి జోగు రామన్న, బోత్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ , ఇన్చార్జి బాల్క సుమన్ ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఇటీవల పార్టీలో చేరిన భార్గవ్దేశ్ పాండే బల ప్రదర్శనకు ఈ వేదిక ఉపయోగించుకుంటున్నారు.

ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలకు కేటీఆర్ ఓదార్పు..!

ఆదిలాబాద్ జిల్లాలో నెల రోజుల్లో 12 మంది రైతులు ఆత్మహత్య చేసుకోగా వారి కుటుంబాలను నేడు కేటీఆర్ పరామర్శించి మనోధైర్యం కల్పించనున్నారు. బోత్ నియోజకవర్గంలోని తలమడుగు కేంద్రం లో ఇటీవల ఆత్మహత్యకు పాల్పడిన రైతు కుటుంబాలు కాడి లక్ష్మన్న (65), గుర్రాల ప్రతాప్ రెడ్డి (55) కుటుంబాల ఇండ్లకు వెళ్లి కేటీఆర్ వారికి పార్టీ తరపున రూ. రెండు లక్షలు చొప్పున ఆర్థిక సాయం అందించనున్నారు. అదేవిధంగా భీంపూర్ మండలం పిప్పల్ కోటి గ్రామానికి చెందిన పసుల ఆశన్న (50), బోత్ మండలం ధనుర్ కు చెందిన బద్దం రాజేశ్వర్ రెడ్డి (50) అనే రైతు కుటుంబానికి కూడా రెండు లక్షల చొప్పున కేటీఆర్ సాయం అందించనున్నారు. ఆ తర్వాత సాయంత్రం 6 గంటలకు ఆదిలాబాద్ డైట్ గ్రౌండ్ లో జరిగే రైతు గర్జన బహిరంగ సభలో కేటీఆర్ ప్రసంగించనున్నారు. రైతాంగ సమస్యలే ప్రధాన ఏజెండ్గా బహిరంగ సభ నిర్వహించేందుకు ఆ పార్టీ భారీ ఏర్పాట్లు చేపట్టింది. ఆదిలాబాద్ పట్టణాన్ని గులాబీ మయంగా మార్చేసింది. రెండు రోజుల కిందట ఇంద్రవెల్లిలో టిఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత బహిరంగ సభ ఏర్పాటు చేసి బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలన వైఫల్యాలను ఎండగట్టగా ఆదివారం సాయంత్రం ఆదిలాబాద్ లో జరిగే కేటీఆర్ రైతు గర్జన సమరభేరి రాజకీయ పర్యాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది.

సర్దార్ వల్లభభాయ్ పటేల్ 151వ జయంతి, రాష్ట్రీయ ఏక్తా దివాస్ సందర్భంగా న్యూఢిల్లీలో 'రన్ ఫర్ యూనిటీ'ని ప్రారంభించిన కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా

న్యూ ఢిల్లీ, నవంబర్ 2:ఇవాళ సర్దార్ వల్లభభాయ్ పటేల్ 151వ జయంతి, రాష్ట్రీయ ఏక్తా దివాస్ సందర్భంగా న్యూఢిల్లీలో నిర్వహించిన 'రన్ ఫర్ యూనిటీ'ని కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్ర హోంమంత్రి దేశ ప్రజలతో 'ఏక్తా ప్రతిజ్ఞ' చేయించారు. ఈ కార్యక్రమంలో ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ శ్రీ తరణ్జిత్ సింగ్ సంధు, కేంద్రమంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ, ఢిల్లీ ముఖ్యమంత్రి శ్రీమతి రేఖా గుప్తా, కేంద్ర హోంశాఖ సహాయమంత్రులు శ్రీ నిత్యానంద్ రాయ్, శ్రీ బండి సంజయ్ కుమార్తో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కేంద్ర హోంమంత్రి, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా మాట్లాడుతూ... దేశ ప్రధానమంత్రిగా శ్రీ నరేంద్ర మోదీ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతిని 'రాష్ట్రీయ ఏక్తా దివస్'గా నిర్వహిస్తున్నామని తెలిపారు. నేడు సర్దార్ సాహెబ్ 151వ జయంతి. ఆయన కేవలం భారత చరిత్రను మార్చటమే కాక, దేశ భౌగోళిక స్వరూపాన్ని తీర్చిదిద్దిన మహనీయులు అని అన్నారు. అనేక సంస్థానాలను, రాజ్యాధీనుల భూభాగాలను ఏకం చేసే కఠినమైన బృహత్కార్యాన్ని చేపట్టి, నేడు మనం చూస్తున్న సమైక్య భారతదేశ పటాన్ని సర్దార్ సాహెబ్ ఆవిష్కరించినట్లు వెల్లడించారు. భారత్కు భౌగోళిక, రాజకీయ, సాంస్కృతిక ఏకీకరణను సాధించటంలోనే కాక, దేశాన్ని ఒకే తాటిపైకి తెచ్చి సమైక్య శక్తిగా నిలపటంలో విజయవంతమైన కృషి చేశారని పేర్కొన్నారు.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పుడు భారతదేశం ముక్కలైపోతుందని ప్రపంచం జోస్యం చెప్పిందని కేంద్ర హోంమంత్రి శ్రీ అమిత్ షా అన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన కేవలం 1,218 రోజుల్లోనే అసాధ్యమని భావించిన దాన్ని సుసాధ్యం చేసి, ఐక్య భారత దేశాన్ని సర్దార్ పటేల్ ఆవిష్కరించారని తెలిపారు. నేడు సర్దార్ పటేల్ కలలుగన్న భారత్... ప్రపంచం ఎదుట గర్వంగా నిలబడిందని తెలిపారు.

ఈ ఏడాది మార్చి 31 నాటికి దేశం నక్సలిజం నుంచి విముక్తి పొందిందని, ఇప్పుడు డ్రగ్స్ రహిత దేశంగా ముందుకు సాగుతోందని కేంద్ర హోంమంత్రి చెప్పారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనికత 'వికసిత్ భారత్' సాధనలో డ్రగ్స్ రహిత భారత్ నిర్మాణం కీలక ముందడుగని స్పష్టం చేశారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ హయాంలో కాశ్మీర్ను శాశ్వతంగా భారత్లో విలీనం చేసే ఆర్టికల్ 370 రద్దు, నక్సలిజం నిర్మూలన, సమగ్ర పన్ను విధానం అమలు వంటి ఎన్నో చరిత్రాత్మక ఘట్టాలను సాధించామని వెల్లడించారు. దేశ యువతకు, భవిష్యత్తుకు ఎంతో మేలు చేసే డ్రగ్స్ రహిత భారత్ ఆవిష్కరణే అన్నింటికంటే గొప్ప విజయమని శ్రీ అమిత్ షా అన్నారు.

దేశ భాషా, సాంస్కృతిక, సంప్రదాయ వైవిధ్యం బలహీనత కాదని... అదే మన బలమని కేంద్ర హోంమంత్రి శ్రీ అమిత్ షా స్పష్టం చేశారు. సర్దార్ పటేల్ నిదేశం ఇదేనని, మనం అనుసరించాల్సిన మార్గం కూడా ఇదేనని పేర్కొన్నారు. మన భాషా, సాంస్కృతిక, మతపరమైన వైవిధ్యమే మన శక్తి అని తెలిపారు. చర్చలు, పరస్పర విశ్వాసం, సమ్మిళిత దృక్పథం ద్వారా 80 ఏళ్లలో మనం ఉమ్మడి జాతీయ గుర్తింపును సాధించుకున్నామని చెప్పారు. మన భాషలు, వస్త్రధారణ, సాంస్కృతిక విశ్వాసాలు, మతాలు వేర్వేరుగా ఉన్నప్పటికీ, దేశం ఎప్పుడూ ఐక్యంగానే నిలిచిందని అన్నారు.

సోమనాథ ఆలయ పునర్నిర్మాణం... నాగరికతా, జాతీయ పునరుజ్జీవన అనుభవమని కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి తెలిపారు. సోమనాథ ఆలయ నిర్మాణం గురించి సర్దార్ పటేల్ కలలుగన్నారని గుర్తు చేశారు. నేడు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో 'మేక్ ఇన్ ఇండియా', 'ఆత్మనిర్భర్ భారత్' కార్యక్రమాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్లో దేశాన్ని అగ్రస్థానంలో నిలబెట్టే దిశగా నడిపిస్తున్నట్లు పేర్కొన్నారు.

సర్దార్ సాహెబ్ దేశానికి చేసిన సేవలకు, ఆయన చేసిన కృషికి ఎన్నో ఏళ్లపాటు తగిన గుర్తింపు లభించలేదని శ్రీ అమిత్ షా అన్నారు. ప్రతివక్షాలు ఎప్పుడూ సర్దార్ సాహెబ్ జ్ఞాపకాలను చెరిపేసేందుకు ప్రయత్నించాయని చెప్పారు. సూర్యకాంతిని ఎలాగైతే దాచలేమో, ఆయన వారసత్వాన్ని కూడా అణచివేయలేమని తెలిపారు. శ్రీ నరేంద్ర మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 'స్టాట్యూ ఆఫ్ యూనిటీ' అత్యున్నత స్మారకాన్ని నిర్మించారని, సర్దార్ సాహెబ్ గొప్ప వ్యక్తిత్వాన్ని యావత్ దేశానికి చాటిచెప్పారని పేర్కొన్నారు. జాతీయ ఐక్యతా సందేశాన్నిస్తూ... అక్కడి నుంచి నేడు దేశవ్యాప్తంగా ఉన్న పోలీసు బలగాల పరేడ్ గౌరవ వందనాన్ని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ స్వీకరిస్తారని శ్రీ అమిత్ షా తెలిపారు.

ఏడు విమానాశ్రయాలలో అంతర్జాతీయ ప్రయాణికులను దృష్టిలో పెట్టుకొని పరీక్షలు మొదలుపెట్టిన 'డిజి యాత్ర'

న్యూ ఢిల్లీ, నవంబర్ 2:భారతదేశంలో ఏడు విమానాశ్రయాలలో అంతర్జాతీయ ప్రయాణికులను దృష్టిలో పెట్టుకొని 'డిజి యాత్ర' పరీక్షలను మొదలుపెట్టారు. ఇది దేశంలో విమానయాన రంగంలో డిజిటల్ సాంకేతికతను అనుసరించే దిశలో వేసిన మరొక అడుగు అని చెప్పాలి. ఈ పరీక్షలను 2026 నవంబర్ మొదలు డిసెంబర్ వరకు చేపడతారు. వీటిలో భాగంగా, ఈ-పాస్పోర్టులు కలిగివున్న భారతీయ పౌరులు ఎయిర్ ఇండియా, ఇండిగో సంస్థలు నిర్వహించే కొన్ని అంతర్జాతీయ ఫ్లైట్లలో ప్రయాణించేటపుడు, ఆయా విమానాశ్రయాలలో నిర్ధారించిన కేంద్రాల వద్ద డిజి యాత్ర సదుపాయాన్ని వినియోగించుకోవచ్చు.

ఈ ప్రయోగాత్మక పథకాన్ని ఢిల్లీ, బెంగళూరు, హైదరాబాద్, కోచి, ముంబయి, చెన్నయి, అమృత్సర్ విమానాశ్రయాలలో నిర్వహిస్తున్నారు. అర్హులైన ప్రయాణికులు టర్మినల్ ప్రవేశ ద్వారాలు, సెక్యూరిటీ హోల్డ్ ఏరియా (ఎస్హెచ్ఏ)లు, బోర్డింగ్ గేట్ల వద్ద, సంబంధిత మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్న చోట్లల్లా, ఈ సదుపాయాన్ని ఉపయోగించుకోవచ్చు. ప్రయోగాత్మకంగా చేపడుతున్న సమయంలో అందే అభిప్రాయాలు 2027లో విస్తృత స్థాయిలో దీనిని అమలు చేసేందుకు సంబందించిన ప్రణాళికను సిద్ధం చేయడంలో ఉపయోగపడతాయని ఆశిస్తున్నారు.

ఈ సదుపాయాన్ని ఉపయోగించుకోవడానికి, అర్హత కలిగిన భారతీయ పౌరులు 'డిజి యాత్ర' మొబైల్ అప్లికేషన్ (యాప్) ద్వారా ఈ-పాస్పోర్ట్ ఆధారిత వెరిఫైయబుల్ క్రెడెన్షియల్ (వీసీ)ని రూపొందించుకోవలసి ఉంటుంది. ఈ ప్రక్రియలో ఈ-పాస్పోర్టు 'మెషీన్ రీడబుల్ జోన్' (ఎమ్ఆర్జడ్)ను స్కాన్ చేయడం, సంబంధిత స్మార్ట్ఫోన్ లోని 'నియర్ ఫీల్డ్ కమ్యూనికేషన్' (ఎన్ఎఫ్సీ) ఫీచరును ఉపయోగించి అందులో అమర్చి ఉన్న చిప్ను చదవడం, సెల్ఫీ తీసుకోవడం, వివరాలను సరైనవని ధ్రువీకరించడం వంటి అంశాలు ఇమిడి ఉంటాయి. ఈ గుర్తింపు పత్రం ప్రయాణికుల డివైస్లో ఉండే 'డిజి యాత్ర' వ్యాలెట్లో నిల్వ అయి ఉంటుంది. దీనిని విమానాశ్రయంలో పరీక్షలకు ఉద్దేశించిన కేంద్రాల వద్ద ఉపయోగించవచ్చు.

ఈ సదుపాయం ప్రస్తుత ప్రయాణ ప్రక్రియలకు ఒక పూరకంగా ఉంటుంది. అంతే తప్ప, ఆ ప్రక్రియలను తోసిరాజనడం ఈ సదుపాయాన్ని ప్రవేశపెట్టడంలోని ఉద్దేశం కానే కాదు. ప్రయాణికులు తమ ప్రయాణ దస్తావేజులను తమతో పాటు అట్టిపెట్టుకోవాలి. విమాన సంస్థ తాలూకు దస్తావేజుల తనిఖీ, ఇమిగ్రేషన్ ప్రక్రియలు, ఇతర 2027లో విస్తృత స్థాయిలో దీనిని అమలు చేసేందుకు సంబందించిన ప్రణాళికను సిద్ధం చేయడంలో ఉపయోగపడతాయని నెట్వర్కులో 'డిజి యాత్ర'ను ఉపయోగించే ధోరణి నిరంతరాయంగా విస్తరిస్తోంది. ఈ సేవను 26.5 మిలియన్ కన్నా ఎక్కువ మంది వినియోగదారులు పొందుతున్నారు. ఇది దేశీయ ఎయిర్లైన్స్ ఉపయోగించుకుంటున్న 39 దేశీయ విమానాశ్రయాలలో 110 మిలియన్కు మించిన ప్రయాణాలకు మార్గాన్ని సుగమం చేసింది. 2027 కల్లా మరో 25 దేశీయ ఎయిర్పోర్టులను దీని ఫీచరును ఉపయోగించి అందులో అమర్చి ఉన్న చిప్ను చదవడం, సెల్ఫీ తీసుకోవడం, వివరాలను సరైనవని ధ్రువీకరించడం వంటి అంశాలు ఇమిడి ఉంటాయి. ఈ గుర్తింపు పత్రం ప్రయాణికుల డివైస్లో ఉండే 'డిజి యాత్ర' వ్యాలెట్లో నిల్వ అయి ఉంటుంది. దీనిని విమానాశ్రయంలో పరీక్షలకు ఉద్దేశించిన కేంద్రాల వద్ద ఉపయోగించవచ్చు.

ఈ సదుపాయం ప్రస్తుత ప్రయాణ ప్రక్రియలకు ఒక పూరకంగా ఉంటుంది. అంతే తప్ప, ఆ ప్రక్రియలను తోసిరాజనడం ఈ సదుపాయాన్ని ప్రవేశపెట్టడంలోని ఉద్దేశం కానే కాదు. ప్రయాణికులు తమ ప్రయాణ దస్తావేజులను తమతో పాటు అట్టిపెట్టుకోవాలి. విమాన సంస్థ తాలూకు దస్తావేజుల తనిఖీ, ఇమిగ్రేషన్ ప్రక్రియలు, ఇతర వర్తించే ప్రయాణ లాంఛనాలను ప్రయాణికులు తప్పనిసరిగా నెరవేర్చవలసి ఉంటుంది.

భారతదేశ విమానయాన

ప్రజావాణి అర్జీలను పెండింగ్లో పెట్టొద్దు!

దరఖాస్తుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి
సత్వర పరిష్కారానికి అధికారులకు కలెక్టర్ ఆదేశాలు
ప్రజావాణిలో అర్జీలు స్వీకరించిన కోయ శ్రీ హర్ష



కరీంనగర్, నవంబర్ 2పజావాణికి వచ్చే అర్జీల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, దరఖాస్తులను పెండింగ్లో ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం పెద్దపల్లి కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. శ్రీరాములుతో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారు.

ధర్మారం మండలం కొత్తూరు గ్రామానికి చెందిన జోగుల లచ్చయ్య సర్వే నంబర్ 429లో ఉన్న ఏడు గుంటల భూమికి పట్టాదారు హక్కులు కల్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. దీనిపై అవసరమైన చర్యలు తీసుకోవాలని ధర్మారం తహసీల్దార్ను కలెక్టర్ ఆదేశించారు.

శ్రీరాంపూర్ మండలం తారుపల్లి గ్రామానికి చెందిన జాసోదపు లక్ష్మి తమది నిరుపేద కుటుంబమని, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరారు. ఈ అర్జీని పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని పీడీ హౌసింగ్కు సూచించారు.

మంథని మండలం నాగారం గ్రామానికి చెందిన గాజుల ప్రశాంత్ తాను దివ్యాంగుడినని, డిగ్రీ పూర్తి చేశానని, ఏదైనా ప్రభుత్వ కార్యాలయంలో ఉద్యోగ అవకాశం కల్పించాలని కోరారు. దీనిపై అవసరమైన చర్యలు తీసుకోవాలని వారధి సొసైటీ అధికారులకు సూచించారు.

రామగుండం మండలం గోదావరిఖని 18 ఇంక్లైన్ కాలనీకి చెందిన గంట నరసమ్మ తమ కుటుంబానికి గృహజ్యోతి పథకం వర్తింపజేయాలని దరఖాస్తు చేసుకున్నారు. దీనిపై పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని రామగుండం ఎంపీడీవోను కలెక్టర్ ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వచ్చునూరులో అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలి మృతి

బంగారు ఆభరణాలు మాయమవడంతో హత్యపై అనుమానాలు

కరీంనగర్, నవంబర్ 2తిమ్మాపూర్ మండలం వచ్చునూరు గ్రామంలో సోమవారం తీవ్ర విషాదం నెలకొంది. గ్రామానికి చెందిన ఉప్పులేటి లచ్చవ్వ (65) అనుమానాస్పద స్థితిలో మృతిచెంది కనిపించారు. ఆమె ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలు మాయమవడంతో, గుర్తుతెలియని దుండగులు బంగారం కోసమే లచ్చవ్వను హత్య చేసి ఉంటారని కుటుంబ సభ్యులు, గ్రామస్థులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సమాచారం అందుకున్న తిమ్మాపూర్ సీఐ అనిల్, ఎస్సై అరుణ్ వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. క్లూస్ టీమ్ ఘటనా స్థలంలో వేలిముద్రలు, ఇతర కీలక ఆధారాలను సేకరించింది. బంగారం కోసం హత్య జరిగిందా? లేక దీని వెనుక మరేదైనా కారణం ఉందా? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. పోస్టుమార్టం నివేదిక, పోలీసుల విచారణ పూర్తయితేనే మృతికి సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

గ్రామాల అభివృద్ధిలో కేసీఆర్ పథకాలే ఆదర్శం

బీఆర్ఎస్ సర్పంచులకు అండగా ఉంటాం: మాజీ మంత్రి జీవన్రెడ్డి



కరీంనగర్, నవంబర్ 2 గ్రామాల అభివృద్ధి కోసం గతంలో కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు ప్రస్తుత సర్పంచులకు ఆదర్శంగా నిలుస్తాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్రెడ్డి అన్నారు. సారంగపూర్ మండలం లచ్చక్కపేట సర్పంచ్ రమ-భాస్కర్ బీఆర్ఎస్లో చేరిన సందర్భంగా సోమవారం తన నివాసంలో వారిని కలిసిన ఆయన మాట్లాడారు.

కేసీఆర్ హయాంలో గ్రామాల సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా హరితహారం, పల్లె ప్రకృతి వనాలు, క్రీడా మైదానాలు, దంపింగ్ యార్డులు, వైకుంఠధామాలు ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. గ్రామాల్లో అవసరాల కోసం ట్రాక్టర్లు, ట్యాంకర్లు కొనుగోలు చేశారని తెలిపారు. నేడు రహదారులకు ఇరువైపులా కనిపిస్తున్న చెట్లు, పచ్చదనం అప్పట్లో నాటినవేనని పేర్కొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల్లో గతంలో ఏర్పాటు చేసిన వ్యవస్థలు కనుమరుగవుతున్నాయని జీవన్రెడ్డి విమర్శించారు. పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు చెల్లించడంలోనూ ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు.

ఎల్లనిో ప్రభావంతో తాగునీటి సమస్యలు ఎదురయ్యే పరిస్థితులు ఉన్నప్పటికీ, కేసీఆర్ ముందుచూపుతో మిషన్ భగీరథ పథకాన్ని తీసుకొచ్చి ప్రతి గ్రామానికి పైపులైన్లు ఏర్పాటు చేశారని చెప్పారు. బావులు, బోర్లు కూడా అందుబాటులోకి తెచ్చారని వివరించారు.

బీఆర్ఎస్ సర్పంచుల పనితీరులో ప్రత్యేకత కనిపించాలని, కాంగ్రెస్ సర్పంచులతో పోలిస్తే అభివృద్ధి, సేవల్లో తేడా చూపించాలని సూచించారు. ముఖ్యంగా పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. అవసరమైతే సొంత డబ్బులు ఖర్చు చేసైనా గ్రామాలను అభివృద్ధి చేయాలని, ఏడాదిలో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తుందని, అప్పటివరకు పెట్టిన ఖర్చులను ఇప్పించే బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు.

ప్రజావాణికి ఆర్అండ్బీ అధికారులు డుమ్మా

కరీంనగర్, నవంబర్ 2జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలంలో ప్రజావాణి కార్యక్రమానికి ఆర్అండ్బీ శాఖ అధికారులు హాజరుకాకపోవడం విమర్శలకు తావిస్తోంది.

ప్రజలకు రహదారులకు సంబంధించిన సమస్యలు ఎన్నో ఉన్నప్పటికీ, వాటిని పరిష్కరించాల్సిన సంబంధిత శాఖ అధికారులే ప్రజావాణికి గైర్హాజరవుతుండటంపై మండల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కార మార్గాలు చూపాల్సిన అధికారులు కార్యక్రమానికి హాజరుకాకపోవడం విధుల పట్ల వారి బాధ్యతారాహిత్యాన్ని సూచిస్తోందని పలువురు ఆక్షేపిస్తున్నారు. జిల్లా కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ ఆర్అండ్బీ అధికారులు హాజరుకాకపోవడంపై ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రజావాణికి హాజరుకావాలన్న నిబంధన ఆర్అండ్బీ శాఖకు వర్తించదా.. జిల్లా కలెక్టర్ ఆదేశాలనూ పట్టించుకోరా.. అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి, విధులకు గైర్హాజరవుతున్న అధికారులపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల సమర్థ వినియోగంపై హైదరాబాద్లో రాష్ట్రస్థాయి కార్యశాలను నిర్వహించనున్న డీజీఎఫ్టీ

న్యూ ఢిల్లీ, నవంబర్ 2:స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల ద్వారా లభించే అవకాశాలను సమర్థవంతంగా వినియోగించుకునే అంశంపై విదేశీ వాణిజ్య సంచాలక జనరల్ హైదరాబాద్ ప్రాంతీయ కార్యాలయం, తెలంగాణ ప్రభుత్వ సహకారంతో నవంబర్ 2, 2026న హైదరా బాద్లోని మాధాపూర్, టీ-హబ్ నాలెడ్జ్ సిటీలో రాష్ట్రస్థాయి కార్యశాలను నిర్వహించనుంది.

భారతదేశం కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలపై అవగాహన పెంపొందించడం, వాటిని సమర్థవంతంగా వినియోగించుకునేలా వాణిజ్య వర్గాలను ప్రోత్సహించడం ఈ కార్యశాల ప్రధాన ఉద్దేశం. అంతర్జాతీయ మార్కెట్లలోకి ప్రవేశాన్ని విస్తరించడం, ఎగుమతులకు సంబందించి కొత్త అవకాశాలను గుర్తించడం, తెలంగాణ రాష్ట్ర ఎగుమతి పోటీతత్వాన్ని మరింత బలోపేతం చేయడంపై ఈ కార్యక్రమం ప్రత్యేకంగా దృష్టి సారించనుంది.

మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభం కానున్న ఈ మెగా ఎఫ్టీఏ అవుటీరీచ్ కార్యక్రమంలో తెలంగాణకు చెందిన ప్రముఖ ఎగుమతిదారులు, జిల్లా పరిశ్రమల కేంద్రాల అధికారులు, ఎగుమతి ప్రోత్సాహక మండళ్ల ప్రతినిధులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉన్నతాధికారులు, వాణిజ్య, పారిశ్రామిక రంగాలకు చెందిన ఇతర భాగస్వాములు సహా సుమారు 200 మంది పాల్గొననున్నారు.ఈ కార్యక్రమంలో ఔషధాలు, ఇంజినీరింగ్, వస్త్ర పరిశ్రమలు, రత్నాలు, ఆభరణాలు వంటి కీలక ఎగుమతి ఆధారిత రంగాలపై ప్రత్యేక విభాగాల వారీ చర్చా సమావేశాలు నిర్వహించనున్నారు. వ్యవసాయం, పాడి పరిశ్రమ, సముద్ర ఉత్పత్తులు, ఆహార భద్రత; వస్త్రాలు, దుస్తులు, వస్త్ర ఉత్పత్తులు; ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్, సెమికండక్టర్లు; సేవల రంగాల్లో అందుబాటులో ఉన్న అవకాశాలు, వాటిని సద్వినియోగం చేసుకునేందుకు చేపట్టాల్సిన ఆచరణాత్మక చర్యలపై కూడా చర్చించనున్నారు.

విధాన నిర్ణేతలు, పారిశ్రామిక ప్రతినిధులు, ఎగుమతి దారుల మధ్య ప్రత్యక్ష పరస్పర చర్చలకు ఈ సమావేశాలు వేదికగా నిలవనున్నాయి. ఆయా రంగాల్లోని నిర్దిష్ట అవకాశాలను గుర్తించడం, స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల వినియోగంలో ఎదు రవుతున్న సవాళ్లను పరిష్కరి ంచడం, ఎగుమతుల పనితీరును మెరుగు పరిచేందుకు ఆచరణాత్మక సూచనలు రూపొందించడం ఈ చర్చల ప్రధాన లక్ష్యం.

చిన్నారుల భద్రత, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

పిల్లల సమగ్ర అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలి
శిశుగృహలో మెరుగైన సౌకర్యాలు కల్పించాలి
జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



కరీంనగర్, నవంబర్ 2 సంరక్షణ, రక్షణ అవసరమైన చిన్నారుల భద్రత, ఆరోగ్యం, సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులకు సూచించారు. సోమవారం సుల్తానాబాద్‌లోని బాలసదన్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన శిశు గృహాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా శిశుగృహలో కల్పించిన సౌకర్యాలను పరిశీలించి, చిన్నారులకు అందించే సంరక్షణ, వసతుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. తల్లిదండ్రుల సంరక్షణకు నోచుకోని, వదిలివేయబడిన, అనాథ, సంరక్షణ అవసరమైన పసిపిల్లలకు సురక్షితమైన ఆశ్రయం కల్పించడమే శిశుగృహ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. శిశు గృహలో పిల్లలకు మెరుగైన సౌకర్యాలు, నాణ్యమైన పోషకాహారం, అవసరమైన వైద్య సదుపాయాలు, తగిన సంరక్షణ అందించాలని ఆదేశించారు. జననం నుంచి ఆరేళ్లలోపు వయస్సు గల చిన్నారులకు ప్రేమపూర్వక సంరక్షణ, పోషకాహారం, వైద్య సదుపాయాలు, ఆరోగ్య పరిరక్షణతో పాటు వయస్సుకు తగిన అభివృద్ధి అవకాశాలను ఈ కేంద్రం ద్వారా అందించనున్నట్లు తెలిపారు.

చిన్నారుల భద్రత, ఆరోగ్య పరిరక్షణ విషయంలో నిర్లక్ష్యం వహించకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పిల్లలకు ఆహ్లాదకరమైన, సురక్షితమైన వాతావరణం కల్పించడంతో పాటు, వారి అవసరాలకు అనుగుణంగా మెరుగైన సదుపాయాలు అందుబాటులో ఉంచాలన్నారు. శిశుగృహలో సంరక్షణ పొందుతున్న అర్హులైన చిన్నారులకు చట్టబద్ధమైన దత్తత ప్రక్రియ ద్వారా కుటుంబ వాతావరణాన్ని కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవడం కూడా ఈ కేంద్రం లక్ష్యాల్లో భాగమని అధికారులు తెలిపారు. చిన్నారుల భవిష్యత్తుకు భరోసా కల్పించేలా నిబంధనల ప్రకారం చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు.

ఈ కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు, మున్సిపల్ కమిషనర్ రమేష్, సీడీపీఓ అనిత, సీనియర్ అసిస్టెంట్ సత్యనారాయణ, జిల్లా బాలల సంరక్షణ అధికారి జితేందర్, బాలసదన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు సిద్ధం కావాలి..

పట్టభద్రులంతా ఓటు నమోదు చేసుకోవాలి
కార్యకర్తలకు దిశానిర్దేశం చేసిన మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు
బీఆర్ఎస్ అభ్యర్థి విజయం ఖాయమని ధీమా

ఖమ్మం, నవంబర్ 2 పట్ట భద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటరుగా తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు సూచించారు. ఇందుకోసం పార్టీ కార్యకర్తలు పట్టభద్రులకు పూర్తి సహాయ సహకారాలు అందించాలని పిలుపునిచ్చారు.

సోమవారం బూర్గంపాడు మండల మాజీ జెడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత అధ్యక్షతన మొరంపల్లి బంజర గ్రామంలో నిర్వహించిన బీఆర్ఎస్ మండలస్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశానికి రేగా కాంతారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ.. మండలంలోని అర్హులైన పట్టభద్రులందరూ ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకునేలా కార్యకర్తలు చొరవ చూపాలని కోరారు. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ పాలన పూర్తిగా విఫలమైందని విమర్శించారు. రానున్న రోజుల్లో ప్రతి కార్యకర్త పార్టీ కోసం సైనికుడిలా పనిచేయాలని సూచించారు. కార్యకర్తలకు ఎలాంటి కష్టం వచ్చినా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. మరో ఏడాది ఓపిక పడితే కార్యకర్తల కష్టాలు తీరుతాయని పేర్కొన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ కార్యకర్తలు, అభిమానులు, సమన్వయకర్తలు తదితరులు పాల్గొన్నారు.

భారత్ రెన్యూవబుల్ ఎనర్జీ సమ్మిట్, ఎక్స్‌పో-2026ను ప్రారంభించనున్న పీఎం సదస్సు ఇతివృత్తం- 'పెట్టుబడి. ఆవిష్కణ. స్ఫూర్తి'

న్యూ ఢిల్లీ, నవంబర్ 2:న వంబర్ 2న న్యూఢిల్లీలోని భారత మండపంలో సాయంత్రం 4:30 గంటలకు భారత్ రెన్యూవబుల్ ఎనర్జీ సమ్మిట్, ఎక్స్‌పో- 2026 ను ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రారంభిస్తారు. ఈ సందర్భంగా సదస్సుకు హాజరైన వారిని ఉద్దేశించి ఆయన ప్రసంగిస్తారు.

నవంబర్ 2 నుంచి 5, 2026 వరకు నాలుగు రోజుల పాటు ఈ సదస్సు జరుగుతుంది. 'పెట్టుబడి. ఆవిష్కణ. స్ఫూర్తి' ఇతివృత్తంతో ఈ సదస్సుని నిర్వహిస్తున్నారు.

భారత్ ఆర్ఈ-2026లో 130కి పైగా దేశాలు, 40 మంది మంత్రులతో పాటు విధాన రూపకర్తలు, పెట్టుబడి దారులు, ఆర్థిక సంస్థలు, పరిశ్రమల ప్రముఖులు పాల్గొంటారు. స్వచ్ఛ ఇంధన రంగంలో పెట్టుబడులకు, పరిశ్రమల భాగస్వామ్యానికి, సాంకేతిక సహకారానికి ప్రపంచ వేదికగా ఈ సదస్సు నిలుస్తుంది. ఆస్ట్రేలియా, డెన్మార్క్, యూరోపియన్ యూనియన్, ఫ్రాన్స్, జర్మనీ, నెదర్లాండ్స్, నార్వే, స్వీడన్, యునైటెడ్ కింగ్‌డమ్ దేశాలు ఇందులో భాగస్వామ్య దేశాలుగా పాల్గొంటున్నాయి.

పదమూడు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు - ఆంధ్రప్రదేశ్, అస్సాం, బీహార్, ఛత్తీస్‌గఢ్, ఢిల్లీ, గుజరాత్, కర్ణాటక, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్... పునరుత్పాదక ఇంధన సామర్థ్యం, పెట్టుబడి అవకాశాలు, తయారీ రంగ నైపుణ్యాలను ప్రదర్శిస్తాయి.

అంతర్జాతీయ సౌర కూటమి (ఐఎస్ఏ) అసెంబ్లీ 9వ సెషన్, నాలుగో గ్రీన్ హైడ్రోజన్ అంతర్జాతీయ సదస్సు (ఐసీజీహెచ్)తో పాటు ఈ సదస్సును నిర్వహించారు. స్వచ్ఛ ఇంధన రంగంలో పెట్టుబడులు, పరిశ్రమ, సాంకేతిక భాగస్వామ్యాలపై భారత్ ఆర్ఈ దృష్టి సారిస్తుండగా... ఆర్థిక, సంస్థాగత సామర్థ్యంతో సహా సౌర ఇంధనంలో అంతర్జాతీయ సహకారాన్ని ఐఎస్ఏ అసెంబ్లీ ముందుకు తీసుకువెళుతుంది. గ్రీన్ హైడ్రోజన్ సాంకేతికతలు, పెట్టుబడులు, వాటి విస్తరణపై ఐసీజీహెచ్ దృష్టి సారిస్తుంది. ఈ మూడు వేదికలు సంయుక్తంగా అంతర్జాతీయ సహకారాన్ని బలపరిచి, స్వచ్ఛ ఇంధన వృద్ధిని వేగవంతం చేస్తాయి.

భారతదేశ ప్రధాన పునరుత్పాదక ఇంధన పెట్టుబడి సదస్సు 'రీ-ఇన్వెస్ట్' వారసత్వాన్ని కొనసాగిస్తూ... స్వచ్ఛ ఇంధన రంగంలో ప్రపంచ స్థాయి భాగస్వామ్యానికి భారత్ ఆర్ఈ 2026 విస్తృత వేదికను అందిస్తుంది. ఈ సదస్సులో పెట్టుబడులు, భాగస్వామ్యాలు, ప్రాజెక్టు అభివృద్ధిని ప్రోత్సహించేందుకు ప్లీనరీ సెషన్‌లు, మంత్రివర్గ చర్చలు, సీఈఓ రౌండ్‌టేబుల్ సమావేశాలు, దేశ, రాష్ట్ర స్థాయి సెషన్‌లతో పాటు బిజినెస్-టు-బిజినెస్, బిజినెస్- టు-గవర్నమెంట్, గవర్నమెంట్-టు-గవర్నమెంట్ సమావేశాలు కూడా జరుగుతాయి. సౌర, పవన విద్యుత్, గ్రీన్ హైడ్రోజన్, ఎనర్జీ స్టోరేజ్, ఇతర అభివృద్ధి చెందుతున్న రంగాల్లో అత్యాధునిక సాంకేతికతలు, భారత తయారీ సామర్థ్యాలు, స్వచ్ఛమైన ఇంధన పరిష్కారాలను ప్రదర్శిస్తూ 400 మందికి పైగా ప్రదర్శనకారులతో ఎక్స్‌పోని నిర్వహిస్తారు.

చింతకానిని కరువు మండలంగా ప్రకటించాలి

11 డిమాండ్లతో సీపీఐ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా
ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్ల పెంపు, రుణమాఫీ అమలు చేయాలని డిమాండ్
ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి



ఖమ్మం, నవంబర్ 2చింతకాని మండలాన్ని కరువు మండలంగా ప్రకటించడంతో పాటు అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని సీపీఐ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోరుతూ సోమవారం సీపీఐ చింతకాని మండల సమితి ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. వర్షాభావ పరిస్థితులతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నందున చింతకాని మండలాన్ని తక్షణమే కరువు మండలంగా ప్రకటించాలని కోరారు. అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, వృద్ధాప్య పింఛన్లను రూ.4 వేలకు, దివ్యాంగుల పింఛన్లను రూ.6 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ అమలు చేయడంతో పాటు గతంలో మంజూరైన రూ.15.50 కోట్ల దళితబంధు నిధులను 155 దళిత కుటుంబాలకు వెంటనే విడుదల చేయాలని కోరారు.

అలాగే 3,800 కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించాలని, మహాలక్ష్మి పథకం కింద మహిళలకు నెలకు రూ.2,500 చెల్లించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, పేదలకు తొమ్మిది రకాల నిత్యావసర సరుకులతో పాటు ప్రతి ఒక్కరికీ 12 కిలోల రేషన్ బియ్యం పంపిణీ చేయాలని కోరారు.

వెంకటాయపాలెం నుంచి కొదుమూరు వరకు ప్రతిఏదించిన 100 అడుగుల రహదారి విస్తరణను గ్రామాల్లో 50 అడుగులకే పరిమితం చేయాలని, చిన్నమండవ గ్రామంలో మున్నేరు నుంచి జరుగుతున్న అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలని విజ్ఞప్తి చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి తక్షణ చర్యలు చేపట్టాలని నాయకులు డిమాండ్ చేశారు. అనంతరం 11 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్‌కు అందజేశారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొండపర్తి గోవిందరావు, ఏపూరి రవీంద్రబాబు, పావులూరి మల్లికార్జున్, కూచిపూడి రవి, మండల కార్యదర్శి దూసరి గోపాలరావు, జిల్లా సమితి సభ్యులు పర్చా రామచంద్రరావు, నారపోగు హేమ, మండల సహాయ కార్యదర్శులు మార్గం శ్రీను, అబ్బూరి మహేష్, నాయకులు పగిడిపల్లి ఏసు, దొబ్బల వెంగళరావు, పదిలం వెంకటనరసయ్య, గోగుల ఆది, గోగుల వెంకట్రావు, హుస్సేన్, గుండ్ల బేబీ రాణి, బస్వాపురం సర్పంచ్ ఆవుల నరసింహారావు, తుపాకుల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు

యువ క్రీడాకారులను ప్రోత్సహించడం అందరి బాధ్యత
ఖమ్మం రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు ప్రారంభించిన డాక్టర్ తుమ్మల యుగంధర్



ఖమ్మం, నవంబర్ 2 యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి, వారికి సరైన ప్రోత్సాహం అందిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే క్రీడాకారులుగా తీర్చిదిద్దవచ్చని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ తుమ్మల యుగంధర్ అన్నారు. విద్యతోపాటు క్రీడలకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలని, క్రీడలు యువతలో శారీరక దృఢత్వంతోపాటు మానసిక పరిపక్వత, క్రమశిక్షణ, పట్టుదల, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. స్థానిక సర్దార్ పటేల్ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన తెలంగాణ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ టోర్నమెంట్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై పోటీలను లాంఛనంగా ప్రారంభిచారు.

ఈ సందర్భంగా క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ.. క్రీడలు కేవలం వినోదానికి మాత్రమే పరిమితం కాకుండా వ్యక్తిత్వ వికాసానికి, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి దోహదపడతాయని తెలిపారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, గెలుపుతో పొంగిపోకుండా, ఓటమితో కుంగిపోకుండా సమానమైన క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు. ఓటమి అనేది విజయానికి మరో మెట్టు మాత్రమేనని, ప్రతి అనుభవం నుంచి పాఠాలు నేర్చుకుంటూ నిరంతరం సాధన చేస్తే లక్ష్యాలను చేరుకోవచ్చని ఉద్బోధించారు. క్రీడాకారులు తమ ప్రతిభను నిరూపించుకోవడంతోపాటు పరస్పర గౌరవం, జట్టు సమన్వయం, క్రమశిక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

రాష్ట్రస్థాయి పోటీల నిర్వహణ వల్ల వివిధ ప్రాంతాలకు చెందిన క్రీడాకారుల మధ్య ప్రతిభా మార్పిడి జరిగి, పోటీతత్వం పెరుగుతుందని యుగంధర్ పేర్కొన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అనేక మంది యువతలో అద్భుతమైన క్రీడా నైపుణ్యాలు ఉన్నప్పటికీ తగిన అవకాశాలు, ప్రోత్సాహం లభించక వెలుగులోకి రావడం లేదన్నారు. అలాంటి ప్రతిభావంతులకు రాష్ట్రస్థాయి పోటీలు మంచి వేదికగా నిలుస్తాయని చెప్పారు. యువతను క్రీడల వైపు ప్రోత్సహించడం ద్వారా చెడు వ్యసనాలకు దూరంగా ఉంచడంతోపాటు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చవచ్చన్నారు. క్రీడాకారుల విజయాలకు తల్లిదండ్రులు, కోచ్‌లు, నిర్వాహకుల ప్రోత్సాహం ఎంతో కీలకమని పేర్కొన్నారు.

అనంతరం టాస్ వేసి మ్యాచ్‌ను ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. క్రీడాకారులతో ముచ్చటిస్తూ వారి ప్రతిభను అభినందించారు. ఖమ్మం వేదికగా రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు నిర్వహించడం అభినందనీయమని, ఇలాంటి క్రీడా కార్యక్రమాలకు ప్రజాప్రతినిధులు, క్రీడాభిమానులు, సంస్థలు తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యారగర్ల హనుమంతరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండీ ఖాదర్ బాబా, టోర్నమెంట్ నిర్వాహకులు, వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన క్రీడాకారులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

అసైన్డ్ భూముల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగినా ఫలితం శూన్యం

నిజామాబాద్, నవంబర్ 2 ప్రభుత్వం తమకు కేటాయించిన అసైన్డ్ భూములను ఇతరులు ఆక్రమించుకున్నారని, తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజ కవర్గంలోని మెండోరా మండల కేంద్రానికి చెందిన ఎస్సీ మాల కులస్తులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సుమారు 20 ఎకరాల భూమిలో సగానికి పైగా ఆక్రమణకు గురైందని, ఎన్నిసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కావడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

1980లో ప్రభుత్వం మెండోరా గ్రామానికి చెందిన ఎస్సీ మాల కులస్తులకు జీవనోపాధి కల్పించాలనే ఉద్దేశంతో సుమారు 20 ఎకరాల అసైన్డ్ భూమిని కేటాయించింది.

అప్పటి నుంచి ఆ భూములపై ఆధారపడి జీవనం సాగిస్తున్నామని బాధితులు తెలిపారు. అయితే కాలక్రమేణా కొందరు వ్యక్తులు తమ భూములను ఆక్రమించుకోవడంతో ప్రస్తుతం కేటాయించిన 20 ఎకరాల్లో కనీసం 10 ఎకరాలు కూడా తమ ఆధీనంలో లేకుండా పోయాయని వాపోయారు.

భూముల సమస్య పరిష్కారం కోసం గత ఆరు నెలలుగా తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నామని, సంబంధిత అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు అందజేసినా ఫలితం లేదని తెలిపారు. మూడు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. రెండు నెలల క్రితం ప్రజావాణిలో సైతం ఫిర్యాదు చేసినా తమ సమస్యకు పరిష్కారం లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

నడిగూడెం గురుకుల విద్యార్థుల పతకాల పంట

నల్గొండ, నవంబర్ 2: జాతీయ స్థాయి కరాటే పోటీల్లో నడిగూడెం గురుకుల పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. ఖమ్మంలోని వర్తక సంఘ భవన్‌లో నవంబర్ 1న నిర్వహించిన 32వ జాతీయ స్థాయి కరాటే ఛాంపియన్‌షిప్‌లో పతకాలతో మెరిశారు. ఈ పోటీల్లో పాఠశాలకు చెందిన 18 మంది విద్యార్థులు పాల్గొని, 2 బంగారు, 6 వెండి, 10 కాంస్య పతకాలతో మొత్తం 18 పతకాలు సాధించారు.కాంస్య పతకాలు: పి. బ్లెస్సీ, ఎం. మహేమా, ఎన్. ప్రణతీ, ఎన్. పూర్ణ తేజిత, పి. భావన శ్రీ, పి. లక్ష్మీ గౌతమి, ఎం. అఖిల, జి. లక్ష్మీ ప్రసన్న, బి. కీర్తి, ఎన్. అశ్విత.జాతీయ స్థాయిలో విద్యార్థులు ప్రతిభ కనబరిచి పతకాలు సాధించడంపై పాఠశాల ప్రిన్సిపాల్ చింతలపాటి వాణి, సీనియర్ వైస్ ప్రిన్సిపాల్ విజయశ్రీ, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ సునీత, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

వీబీ-జీ రామ్ జీ చట్టం కింద ఫిర్యాదుల పరిష్కార నిబంధనలు- 2026ను ప్రకటించిన గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ

న్యూఢిల్లీ, నవంబర్ 2భారత ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ 'వికసిత్ భారత్-గ్యారంటీ ఫర్ రోజ్‌గార్, ఆజీవికా మిషన్ (గ్రామీణ్)' (వీబీ-జీ రామ్ జీ) పథకం అమలుకు సంబంధించిన ఫిర్యాదుల పరిష్కారం కోసం 'ఫిర్యాదుల పరిష్కార నిబంధనలు-2026'ను ప్రకటించింది. ఈ నిబంధనల ద్వారా క్రమబద్ధమైన, బహుళ అంచెల, నిర్దిష్ట గడువుతో కూడిన ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను ఏర్పాటు చేసింది. ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియను మరింత అందుబాటులోకి తీసుకురావడం, పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంపొందించడం ఈ నిబంధనల లక్ష్యం. అదే సమయంలో పౌరుల సమస్యలను సకాలంలో పరిశీలించి, తగిన చర్యలు తీసుకునేలా ఈ వ్యవస్థను రూపొందించారు.

ఈ నిబంధనల ప్రకారం.. గ్రామ పంచాయతీ, బ్లాక్, జిల్లా స్థాయిల్లో రాష్ట్ర ప్రభుత్వాలు నిర్దిష్ట గడువుతో కూడిన బహుళ అంచెల ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను ఏర్పాటు చేయాలి. ఆయా స్థాయిల్లో నియమితులైన ఫిర్యాదుల పరిష్కార అధికారులు ఫిర్యాదులను స్వీకరించడం, నమోదు చేయడం, విచారించడం, పరిష్కరించడం వంటి బాధ్యతలను నిర్వహిస్తారు.

జిల్లా స్థాయిలో ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియను జిల్లా కార్యక్రమ సమన్వయకర్త పర్యవేక్షిస్తారు. నియమిత వ్యవస్థతో పాటు ఫిర్యాదుల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాల ద్వారా ఫిర్యాదులపై చర్యలు తీసుకునేలా చూస్తారు.

ఫిర్యాదుల సమర్పణను సులభతరం చేసేందుకు, పథకం అమలుకు సంబంధించిన లేదా దానితో ముడిపడి ఉన్న ఏ అంశంపైనైనా ఎవరైనా ఫిర్యాదు చేయవచ్చు. ఇందుకోసం ఈ నిబంధనల్లో పలు మార్గాలను కల్పించారు.

గ్రామ పంచాయతీ, బ్లాక్ లేదా జిల్లా స్థాయిలో భౌతిక రూపంలో అందిన ఫిర్యాదులను స్వీకరించిన రోజే నిర్దేశిత డిజిటల్‌ప్రజా మౌలిక సదుపాయాల్లో నమోదు చేయాలి. ఆ రోజు నమోదు చేయడం సాధ్యం కాని పరిస్థితుల్లో, తదుపరి పని దినంలోగా నమోదు చేయాల్సి ఉంటుంది.

ఫిర్యాదు నమోదైన వెంటనే ఫిర్యాదుదారుడికి రశీదు అందజేస్తారు. అందులో ఫిర్యాదు నమోదు సంఖ్య, స్వీకరించిన తేదీ, ఫిర్యాదును స్వీకరించిన అధికారి హోదా వివరాలు ఉంటాయి. డిజిటల్ విధానంలో ఫిర్యాదు సమర్పించిన వారికి ఎలక్ట్రానిక్ రూపంలో, భౌతికంగా ఫిర్యాదు అందించిన వారికి భౌతిక రూపంలో ఈ రశీదును అందిస్తారు.

ముఖ్యంగా ఫిర్యాదు సమర్పించిన విధానం, భాష, రూపం లేదా ప్రక్రియాపరమైన లోపాలను కారణంగా చూపి ఏ ఫిర్యాదునూ నమోదు చేయకుండా తిరస్కరించకూడదు. ఈ నిబంధన ద్వారా ప్రక్రియాపరమైన నిబంధనలు పౌరులకు అడ్డంకిగా మారకుండా, ప్రతి ఒక్కరికీ ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ అందుబాటులో ఉండేలా చూస్తారు.

ఫిర్యాదులను సత్వరంగా పరిశీలించి పరిష్కరించేందుకు ఈ నిబంధనల్లో స్పష్టమైన గడువులను నిర్దేశించారు. నమోదైన ప్రతి ఫిర్యాదును సంబంధిత ఫిర్యాదుల పరిష్కార అధికారి పరిశీలించి, అవసరమైన విచారణ చేపట్టాలి. ఇందుకోసం సంబంధిత అధికారులు లేదా సిబ్బంది నుంచి అవసరమైన రికార్డులు, రిజిస్టర్లు, పత్రాలు, నివేదికలు, ఎలక్ట్రానిక్ డేటా లేదా ఇతర సమాచారాన్ని ఆ అధికారి కోరవచ్చు.

అవసరమైన సందర్భాల్లో ఫిర్యాదుపై తుది నిర్ణయం తీసుకునే ముందు ఫిర్యాదు దారుడికి తన వాదనను వినిపించుకునే సముచిత అవకాశం కల్పించాలి. ఇందుకోసం ప్రత్యక్షంగా లేదా ఎలక్ట్రానిక్ మాధ్యమం ద్వారా అవకాశం ఇవ్వవచ్చు.

ఫిర్యాదు అందిన తేదీ నుంచి ఏడు పని దినాల్లోగా దానిపై విచారణ పూర్తి చేయాలి. విచారణ పూర్తయిన అనంతరం ఫిర్యాదుల పరిష్కార అధికారి తన నిర్ధారణలను నమోదు చేసి, చట్టం, నిబంధనలకు అనుగుణంగా తగిన దిద్దుబాటు లేదా పరిష్కార చర్యలు చేపట్టాలి లేదా చేపట్టేలా చూడాలి. ఫిర్యాదు అందిన తేదీ నుంచి 15 రోజుల్లోగా దాన్ని పరిష్కరించాలి.

విచారణలో వెల్లడైన అంశాలు, తీసుకున్న చర్యల వివరాలను నిర్దేశిత డిజిటల్ ప్రజా మౌలిక సదపాయాల్లో నమోదు చేసి, వాటిని ఫిర్యాదుదారుడికి తెలియజేస్తారు. భౌతిక రూపంలో అందిన ఫిర్యాదుల విషయంలో, వాటి పరిష్కార వివరాలు, తీసుకున్న చర్యలను కూడా ఫిర్యాదుదారుడికి భౌతిక రూపంలోనే తెలియజేస్తారు.

పేద విద్యార్థుల చదువుకు ఉపాధ్యాయుడి ఆర్థిక చేయూత

ముగ్గురు విద్యార్థులకు రూ.6,600 సాయం
యూనిఫారాలు, స్టడీ మెటీరియల్ కోసం ఆర్థిక సహకారం
డా. బిగుళ్ల బాబు సేవాభావంపై అభినందనలు



మెదక్, నవంబర్ 2 విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పాటునందిస్తూ ఓ ఉపాధ్యాయుడు తన సేవాభావాన్ని చాటుకున్నారు. సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలంలోని తెలంగాణ మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కళాశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న డా. బిగుళ్ల బాబు కొన్నేళ్లుగా పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందిస్తున్నారు.

ఇందులో భాగంగా తాజాగా ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ముగ్గురు విద్యార్థులకు ఆర్థిక చేయూతనందించారు. రోహిత్ వర్మ, గండ్ల కావ్య, భువనేశ్వరి ఒక్కొక్కరికి రూ.2,200 చొప్పున మొత్తం రూ.6,600 అందజేశారు. రెండు జతల యూనిఫారాలు, స్టడీ మెటీరియల్ కొనుగోలుకు ఈ మొత్తాన్ని కేటాయించారు.

కళాశాల ప్రిన్సిపాల్ ఖలీదా షిరీన్, వైస్ ప్రిన్సిపాల్ జె. శ్రీనివాస్ చేతుల మీదుగా విద్యార్థులకు నగదును అందించారు. పేద విద్యార్థుల చదువుకు నిరంతరం సహాయ సహకారాలు అందిస్తున్న డా. బిగుళ్ల బాబును ఈ సందర్భంగా వారు అభినందించారు.

21వ రోజుకు చేరిన ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమ్మె

90 ఉప ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవలకు ఆటంకం
గ్రామీణ ప్రజలకు తప్పని వైద్య ఇబ్బందులు
ఉద్యోగులను వెంటనే క్రమబద్ధీకరించాలి: ఐక్య కార్యాచరణ సమితి



వరంగల్, నవంబర్ 2జయ శంకర్ భూపాలపల్లి జిల్లాలో జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఉద్యోగుల సమ్మె సోమవారం నాటికి 21వ రోజుకు చేరుకుంది. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించకపోవడంతో ఆందోళన కొనసాగుతోంది. మరోవైపు జిల్లాలోని సుమారు 90 ఉప ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవలకు అంతరాయం ఏర్పడటంతో గ్రామీణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, వృద్ధులకు ప్రాథమిక వైద్య సేవలు అందక అవస్థలు పడుతున్నారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను వెంటనే క్రమబద్ధీకరించాలని, తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి జిల్లా అధ్యక్షుడు బడితల రమేష్ ప్రధాన కార్యదర్శి మధు, కార్యనిర్వాహక అధ్యక్షుడు వెంకటేష్, ఉపాధ్యక్షుడు డాక్టర్ రఘురాం, సలహాదారులు శ్రీనివాస్, ప్రభాకర్, జిల్లా సమన్వయకర్త ప్రవీణ్, డాక్టర్ జగదీష్, ప్రచార మాధ్యమాల బాధ్యుడు రాజు, డాక్టర్ విజయ్, డాక్టర్ బాలకృష్ణ, కృష్ణవేణి, పార్వతి తదితరులు పాల్గొన్నారు. నాయక నర్సులు, స్టాఫ్ నర్సులు, ఔషధ పంపిణీ అధికారులు, ఇతర సిబ్బంది సమ్మెలో పాల్గొన్నారు.

ప్రభుత్వాన్ని కోరారు.

ఈ కార్యక్రమంలో జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి జిల్లా అధ్యక్షుడు బడితల రమేష్, ప్రధాన కార్యదర్శి మధు, కార్యనిర్వాహక అధ్యక్షుడు వెంకటేష్, ఉపాధ్యక్షుడు డాక్టర్ రఘురాం, సలహాదారులు శ్రీనివాస్, ప్రభాకర్, జిల్లా సమన్వయకర్త ప్రవీణ్, డాక్టర్ జగదీష్, ప్రచార మాధ్యమాల బాధ్యుడు రాజు, డాక్టర్ విజయ్, డాక్టర్ బాలకృష్ణ, కృష్ణవేణి, పార్వతి తదితరులు పాల్గొన్నారు. నాయక నర్సులు, స్టాఫ్ నర్సులు, ఔషధ పంపిణీ అధికారులు, ఇతర సిబ్బంది సమ్మెలో పాల్గొన్నారు. ప్రభుత్వం ఇకనైనా స్పందించి ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు.

సమ్మెకు బీసీ ఐక్య కార్యాచరణ సమితి, తెలంగాణ ఉద్యమకారుల వేదిక జయశంకర్ జిల్లా అధ్యక్షుడు రమేష్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగులను వెంటనే క్రమబద్ధీకరించి, వారి సమస్యలను పరిష్కరించాలని

విద్యా ప్రమాణాల్లో నారాయణపేటను ఆదర్శంగా తీర్చిదిద్దాలి

నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా పనిచేయాలి
నూతన బోధనా పద్ధతులను తరగతి గదుల్లో అమలు చేయాలి
ఉపాధ్యాయులకు ఆర్జేడీ సోమిరెడ్డి సూచనలు

మహబూబ్‌నగర్, నవంబర్ 2 నారాయణపేట జిల్లాలో విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరిచి, రాష్ట్రస్థాయిలో ఆదర్శంగా నిలిపేందుకు ఉపాధ్యాయులందరూ సమష్టిగా కృషి చేయాలని పాఠశాల విద్యాశాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు (ఆర్జేడీ) సోమిరెడ్డి సూచించారు. సోమవారం ఊట్కూర్ మండల పరిధిలోని పీఎం శ్రీ చిన్నపోర్ల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కాంప్లెక్స్ స్థాయి ఉపాధ్యాయుల సమావేశాన్ని ఆయన సందర్శించారు.

ఈ సందర్భంగా రిసోర్స్ పర్సన్లు (ఆర్పీలు) నిర్వహిస్తున్న బోధనా తరగతులను పరిశీలించారు. ఉపాధ్యాయులకు అందిస్తున్న శిక్షణ, నూతన బోధనా పద్ధతులు, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు చేపడుతున్న కార్యక్రమాలను ఆసక్తిగా తిలకించారు. సమావేశం నిర్వహణ తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ.. చదువు ఒక్కటే వ్యక్తి జీవితంలో మార్పు తీసుకొచ్చే శక్తివంతమైన సాధనమని, విద్య ద్వారానే కుటుంబాలు, సమాజం అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. కాంప్లెక్స్ సమావేశాల్లో నేర్చుకున్న నూతన బోధనా పద్ధతులు, మెళకువలు, అనుభవాలను తరగతి గదుల్లో సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు.

జిల్లా విద్యా ప్రమాణాలు రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలిచేలా ప్రతి ఉపాధ్యాయుడు బాధ్యతతో పనిచేయాలన్నారు. ముఖ్యంగా విద్యార్థుల్లో చదవడం, రాయడం, గణితానికి సంబంధించిన ప్రాథమిక నైపుణ్యాలను మెరుగుపెంపొందించేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలిపారు. విద్యలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, వారికి అదనపు అభ్యసన సహకారం అందించాలని సూచించారు. ప్రతి విద్యార్థి అభ్యసన స్థాయిలో పురోగతి సాధించేలా నిరంతరం పర్యవేక్షించాలని పేర్కొన్నారు.

అనంతరం పీఎం శ్రీ పాఠశాలను సందర్శించి బోధనా వాతావరణం, విద్యార్థుల అభ్యసన స్థాయిలు, అందుబాటులో ఉన్న విద్యా సదుపాయాలను పరిశీలించారు. పీఎం శ్రీ పాఠశాల లక్ష్యాలకు అనుగుణంగా నాణ్యమైన విద్య, నూతన బోధనా విధానాలు, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

కాంప్లెక్స్ సమావేశాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తున్న మండల విద్యాధికారి మాధవి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు నరేందర్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఉపాధ్యాయుల వృత్తి నైపుణ్యాభివృద్ధికి కాంప్లెక్స్ సమావేశాలు ఎంతగానో ఉపయోగపడతాయని, వీటి ద్వారా పాఠశాలల్లో బోధనా ప్రమాణాలు మరింత మెరుగుపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని వినతి
010 పద్దు ద్వారా వేతనాలు చెల్లించాలని డిమాండ్
పదోన్నతులు, కారుణ్య నియామకాలు చేపట్టాలని విజ్ఞప్తి

మహబూబ్‌నగర్, నవంబర్ 2మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించి, న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ సోమవారం నర్సింహులపేట మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు వినతిపత్రాలు సమర్పించారు. భోజన విరామ సమయంలో తహసీల్దార్ రవీష్‌బాబుకు రెవెన్యూ కార్యాలయంలో, ఎంపీడీవో అంజలికి మండల పరిషత్ కార్యాలయంలో వినతిపత్రాలు అందజేశారు.

ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. 010 పద్దు ద్వారా వేతనాలు చెల్లించాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని, పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. అర్హులైన టీజీటీ ఉపాధ్యాయులకు నోషనల్ ప్రయోజనాలు కల్పించడంతో పాటు హెచ్‌బీటీ ఉపాధ్యాయుల వేతనాలు పెంచాలని కోరారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిశీలించి పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

క్రీడలతోనే యువతకు క్రమశిక్షణ.. ఆత్మవిశ్వాసం!

బ్యాడ్మింటన్ క్రీడాకారులను ప్రోత్సహించాలి
గ్రామీణ ప్రాంతాల ప్రతిభకు పోటీలు చక్కని వేదిక
మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి



నిజామాబాద్, నవంబర్ 2 క్రీడలు యువతలో క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతోపాటు శారీరక, మానసిక ఆరోగ్యానికి దోహదపడతాయని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు.

నిజామాబాద్ జిల్లా కమ్మంపల్లి ఇండోర్ స్టేడియంలో కమ్మంపల్లి బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీపాద రాజేందర్ చారి స్మారక తెలంగాణ బ్యాడ్మింటన్ పోటీల ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచి విజయం సాధించిన క్రీడాకారులకు బహుమతులు అందజేసి అభినందించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలు కేవలం గెలుపోటములకే పరిమితం కావని, జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొనే స్ఫూర్తిని అందిస్తాయని అన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపైనా ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. క్రీడల్లో రాణించాలంటే నిరంతర సాధన, క్రమశిక్షణ, పట్టుదల ఎంతో అవసరమని పేర్కొన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రీడల వైపు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు.

గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా మౌలిక సదుపాయాలను ప్రోత్సహించడం, ప్రతిభావంతులైన క్రీడాకారులకు తగిన అవకాశాలు కల్పించడం ద్వారా రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించే క్రీడాకారులను తీర్చిదిద్దవచ్చని తెలిపారు. బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్మారక టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో కమ్మర్‌పల్లి గ్రామ సర్పంచ్ కొత్తపల్లి హారిక అశోక్, ఉపసర్పంచ్ కొత్తపల్లి అశోక్, పీడీసీసీ చైర్మన్ మల్యాల సుభాష్ గౌడ్, బద్దం చిన్నారెడ్డి, గడ్డం స్వామి, కొంటికంటి నరేందర్, రిటైర్డ్ ఎంఈఓ దేవేందర్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బోనగిరి భాస్కర్, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రేగుంట దేవేందర్, బీజేపీ అధ్యక్షుడు చేగంటి రవీష్, నుంకేట బుచ్చన్న, క్లబ్ సలహాదారులు ఎండీ హైమద్, పెంట కిషన్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు తెడ్డు రమేష్, హస కొత్తూరు సర్పంచ్ గంగాధర్, గోపి లింగారెడ్డి, సుంకేట రమేష్, శ్రీపాద రాహుల్, చిలివేరి పవన్‌కుమార్, జోగ గంగాధర్, బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రతినిధులు, క్రీడాకారులు, నిర్వాహకులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

గిరిజన వైద్యుల కోసం ప్రజారోగ్యంపై జాతీయ అవగాహన కార్యక్రమం, కన్హా శాంతి వనం, హైదరాబాద్



న్యూఢిల్లీ, నవంబర్ 2గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ, జనజాతీయ ఆరోగ్య సంస్థాగత పరివర్తన (ఏజీనిఉమి) చొరవ కింద, భువనేశ్వర్‌లోని ఐసీఎంఆర్?నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ రీసెర్చ్ (ఎఅఓఖీ-ఔఎఊఖీ) సహకారంతో, ప్రజారోగ్యంపై గిరిజన వైద్యుల కోసం మొట్టమొదటి జాతీయ అవగాహన కార్యక్రమాన్ని 1?2 నవంబర్ 2026న హైదరాబాద్‌లోని కన్హా శాంతి వనంలో నిర్వహించింది. ఈ కార్యక్రమాన్ని హైదరాబాద్‌లోని కన్హా శాంతి వనం ఆడిటోరియంలో శ్రీ. గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి మనీష్ ఠాకూర్ మరియు భువనేశ్వర్‌లోని ఐసీఎంఆర్-ఎన్ఐహెచ్ఆర్ డైరెక్టర్ డాక్టర్ సంఘమిత్ర పతి, తెలంగాణ గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి మరియు డైరెక్టర్ శ్రీ బి. ఎం. సంతోష్, ఐఏఎస్, తెలంగాణ గిరిజన సాంస్కృతిక పరిశోధన డ శిక్షణ సంస్థ (టీసీఆర్‌డబీఐ) డైరెక్టర్ డాక్టర్ వి. సముజ్వాల, మరియు గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ మరియు భువనేశ్వర్‌లోని ఐసీఎంఆర్-ఎన్ఐహెచ్ఆర్ నుండి ఇతర సీనియర్ అధికారుల సమక్షంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. జనజాతీయ గౌరవ్ దివస్ పఖ్వాడా మొదటి రోజున ఈ చారిత్రాత్మక కార్యక్రమాన్ని ప్రారంభించడం, సమగ్ర ఆరోగ్యం మరియు సామర్థ్య నిర్మాణ కార్యక్రమాల ద్వారా భారతదేశంలోని గిరిజన వర్గాలను గౌరవించడం మరియు వారికి సాధికారత కల్పించడం పట్ల ఉన్న ఉమ్మడి నిబద్ధతను నొక్కి చెబుతోంది.

అవగాహన కార్యక్రమం యొక్క మొదటి దశలో, భారతదేశంలోని తొమ్మిది రాష్ట్రాలు మరియు కేంద్రపాలిత ప్రాంతాల (ఆంధ్రప్రదేశ్, గోవా, కర్ణాటక, కేరళం, మహారాష్ట్ర, ఒడిశా, తమిళనాడు, తెలంగాణ, మరియు దాద్రా మరియు నగర్ హవేలీ) నుండి రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖలచే నామినేట్ చేయబడిన సుమారు 550 మంది గిరిజన వైద్యులు పాల్గొంటున్నారు. ఈ అవగాహన కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యం, గిరిజన వైద్యులకు కీలకమైన ప్రజారోగ్య సమస్యలపై అవగాహన కల్పించడం, సాధారణ వ్యాధులు, ప్రమాద సంకేతాలను ముందుగానే గుర్తించడం, మరియు సకాలంలో వైద్య సంరక్షణ కోసం సరైన నిపుణులను సంప్రదించడం వంటి విషయాలపై వారి అవగాహనను బలోపేతం చేయడం. గిరిజన సమాజాలలో వైద్యుల ముఖ్యమైన పాత్రను గుర్తించి, ఈ కార్యక్రమం వారికి అవసరమైన ఆరోగ్య పద్ధతులపై అవగాహనను పెంచడానికి మరియు అధికారిక ఆరోగ్య సంరక్షణ వ్యవస్థతో సంబంధాలను ప్రోత్సహించడానికి ప్రయత్నిస్తుంది.

రెండు రోజుల పాటు జరిగే ఈ అవగాహన కార్యక్రమంలో, ప్రజారోగ్యానికి సంబంధించిన అనేక రకాల సమస్యలపై మూడు శిక్షణా మాడ్యూల్స్ ఉంటాయి. వీటిలో అంటువ్యాధులు మరియు కీటకాల ద్వారా సంక్రమించే వ్యాధులు, చర్మ వ్యాధులు, అంటువ్యాధులు కాని వ్యాధులు, జీవక్రియ మరియు రక్త సంబంధిత రుగ్మతలు, కాలేయ వ్యాధులు, మరియు మానసిక ఆరోగ్య సమస్యలు ఉన్నాయి. ఈ సెషన్లలో పాముకాటు, తేలు మరియు ఇతర కాటులు, జంతువుల కాటు, గాయాలు, కంటి మరియు చెవి సంబంధిత రుగ్మతలు; నోటి ఆరోగ్యం; మరియు నవజాత శిశువుల సంరక్షణ వంటి వాటికి సరైన సిఫార్సులపై కూడా దృష్టి సారిస్తారు. అభ్యాసాన్ని పటిష్టం చేయడానికి మరియు ఓరియంటేషన్ యొక్క ప్రభావాన్ని అంచనా వేయడానికి, ఈ శిక్షణలో సమగ్ర అభ్యాసం, సమీక్షా సెషన్లు, శిక్షణానంతర మూల్యాంకనం మరియు పాల్గొనేవారి అభిప్రాయ సేకరణ కూడా ఉంటాయి.

సిక్కింలో పర్యటించిన కేంద్ర మంత్రి శ్రీ రాజీవ్ రంజన్ సింగ్



న్యూఢిల్లీ, నవంబర్ 2: గౌరవనీయ కేంద్ర మత్స్య, పశు సంవర్ధక మరియు పాడి పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ రాజీవ్ రంజన్ సింగ్ (అలియాస్ లలన్ సింగ్), 2026 నవంబర్ 2-3 తేదీలలో సిక్కింలోని గాంగ్‌టక్ మరియు మాంగన్ జిల్లాలను సందర్శించనున్నారు. ఈ పర్యటన సందర్భంగా, గౌరవనీయ కేంద్ర మంత్రి గారు పాడి పరిశ్రమ అభివృద్ధి కార్యక్రమాలను సమీక్షించి, జాతీయ పాడి పరిశ్రమ అభివృద్ధి కార్యక్రమం కింద సిక్కిం మిల్క్ యూనియన్ కోసం ఒక మైక్రోబయాలజీ ల్యాబ్‌లో తయారయ్యే చుర్పి చీజ్ యొక్క మూలాలను గుర్తించే కార్యక్రమాన్ని కూడా ఆవిష్కరించనున్నారు.

గౌరవనీయ కేంద్ర మంత్రి గారు, భారత ప్రభుత్వ 10,000 రైతు ఉత్పత్తిదారుల సంస్థల పథకం కింద సిక్కిం మిల్క్ యూనియన్ కోసం రెండు పశు గ్రాసం ప్లస్ రైతు ఉత్పత్తిదారుల సంస్థలను మరింతగా ప్రోత్సహించనున్నారు. ఉత్పత్తి వైవిధ్యీకరణ మరియు విలువ జోడింపు దిశగా ఒక ముఖ్యమైన అడుగుగా, ఆయన సేంద్రీయ తేనె, నైజర్ విత్తనాల మిశ్రమ పొడి, మరియు చిరుధాన్యాలు, బుక్‌వీట్‌తో తయారు చేసిన సేంద్రీయ బిస్కెట్లు, స్వీట్లతో సహా కొత్త ఉత్పత్తులను కూడా ఆవిష్కరించనున్నారు.

ఈ పర్యటనలో సిక్కిం ప్రభుత్వ ఉన్నతాధికారులు, మాంగన్ జిల్లా పరిపాలన అధికారులు, భారత ప్రభుత్వ పశు సంవర్ధక మరియు పాడిపరిశ్రమల శాఖ , సంబంధిత లైన్ మంత్రిత్వ శాఖలు, జాతీయ పాడి అభివృద్ధి బోర్డు , పాడి రైతులు, పాడి సహకార సంఘాలు మరియు పాడి రైతు ఉత్పత్తిదారుల సంస్థల ప్రతినిధులు పాల్గొననున్నారు.

ఈశాన్య ప్రాంతం లో పాడి అభివృద్ధిలో సిక్కిం కీలక పాత్ర పోషించింది. 2024-25 సంవత్సరంలో ఇక్కడ సుమారు 89.35 వేల మెట్రిక్ టన్నుల పాల ఉత్పత్తి జరగగా, తలసరి పాల లభ్యత రోజుకు దాదాపు 352 గ్రాములుగా ఉంది. రాష్ట్రంలో పాడి రంగం వృద్ధికి మద్దతుగా, ఆంఊఆ 2014 నుండి రాష్ట్రీయ గోకుల్ మిషన్ కింద -7,093.99 లక్షలను విడుదల చేసింది. అంతేకాకుండా, దేశీయ సిరి పశు జాతి అభివృద్ధి మరియు సంరక్షణ కోసం 2,763.92 లక్షల విలువైన ఒక ప్రత్యేక ప్రాజెక్టును మంజూరు చేశారు.

సిక్కింలో యాక్‌ల అభివృద్ధి మరియు సంరక్షణ కోసం, 2023-24 సంవత్సరంలో -100 లక్షల నిధులు విడుదల చేయబడ్డాయి. అదనంగా, రాష్ట్రీయ గోకుల్ మిషన్ కింద అధిక జన్యు యోగ్యత గల యాక్ ఎద్దుల సేకరణ కోసం ప్రస్తుత 2026-27 ఆర్థిక సంవత్సరంలో-100 లక్షలు విడుదల చేయబడ్డాయి.

జాతీయ పాడి అభివృద్ధి కార్యక్రమం కింద, కేంద్ర వాటా 54.61 కోట్లతో సహా, మొత్తం -59.60 కోట్ల వ్యయంతో ఆంఊఆ తొమ్మిది ప్రాజెక్టులను మంజూరు చేసింది. ఈ మొత్తంలో, 53.59 కోట్లు విడుదల చేయబడగా, 52.61 కోట్లు వినియోగించబడ్డాయి.

జాతీయ పశుసంపద మిషన్ కింద, 2020-21 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు పశు గ్రాసం ఉత్పత్తికి ?1,914.39 లక్షలు, పశుసంపద బీమాకు ?530.62 లక్షలు, చిన్న నెమరు వేసే జంతువులు మరియు పందుల జాతి అభివృద్ధికి -408.64 లక్షలు, మరియు శిక్షణ మరియు విస్తరణ కార్యకలాపాలకు 359.80 లక్షల ఆర్థిక సహాయాన్ని అందించింది.

అప్పు వివాదం.. మృతదేహంతో కుటుంబ సభ్యుల ఆందోళన!

వరంగల్, నవంబర్ 2అప్పు వ్యవహారం ఓ వృద్ధుడి కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపిందని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. వరంగల్ జిల్లా రాయపర్తి మండలం తిరుమలాయపల్లి గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ముద్రబోయిన ముత్తయ్య (80) మృతదేహంతో కుటుంబ సభ్యులు ఆదివారం రాత్రి మాజీ సర్పంచ్ గజవెల్లి అనంతప్రసాద్ ఇంటి ఎదుట నిరసన తెలిపారు.

ఖండాంతర ఖ్యాతిని ఆర్జించిన ఏల్చూరి

నవంబర్ 3... ఏల్చూరి విజయరాఘవ రావు జయంతి



ఏల్చూరి విజయరాఘవ రావు (నవంబర్ 3, 1925 – నవంబర్ 30, 2011) ఖండాంతర ప్రఖ్యాత భారతీయ సంగీత కారుడు, వేణుగాన విద్వాంసుడు, సంగీత దర్శకుడు, సంగీత బాణీలు సమ కూర్చులో నిష్ణాతుడు, నర్తకుడు, బహుభాషా కోవిదుడు, ప్రయోక్త, సంగీత నాటక అకాడమి అవార్డు గ్రహీత, "పద్మశ్రీ" విజేతయైన అత్యంత ప్రతిభా వంతుడు. "రఘుపతి రాఘవ రాజారాం" పాట స్వరకర్త. మహాత్మా గాంధీనే తన రామధున్ కార్యక్రమం ద్వారా మెప్పించాడు. సర్దార్ పటేల్ కు స్వస్థత చేకూర్పు కోసం, కొంత కాలం సంగీతం వినిపించాడు. ఖండాంతర ఖ్యాతి నార్జించాడు. ప్రపంచంలో మూడు ఖండాలలో ఒకసారి కాదు, ఎన్నోసార్లు ఆయన సంగీత కచేరీలు నిర్వహించాడు. ఆయన వేణునాద రికార్డులు ఇంగ్లండు, పారిస్‌లోనూ లభిస్తాయి. ప్రాచుర్యం పొందాయి. బహు భాషావేత్త గా, వాద్య కారునిగా, నర్తకునిగా, స్వరకర్తగా, రచయితగా, ప్రాసంగికునిగా, ఆయన చేసిన కృషి అనన్య సామాన్యం.

విజయ రాఘవరావు ఏల్చూరి రామయ్య, సుబ్బాయమ్మ దంపతుల ద్వితీయ సంతానంగా 1925, నవంబర్ 3 న జన్మించాడు. ఆయన పసి బిడ్డగా ఉండగానె తండ్రి మృతి చెందారు. అయన సోదరుడు నయాగరా కవుల్లో ఒకరైన శ్రీ ఏల్చూరి సుబ్రహ్మణ్యం. తండ్రి నుంచి ఆయనకు సంగీతా భిమానం సంక్రమించింది.

ఆయన తెలుగు, ఇంగ్లీష్, హిందీ లతో బాటుగా బెంగాలీ వంటి ఇతర భాషలు కూడా క్షుణ్ణంగా అధ్య యనం చేశాడు. విజయ రాఘవ రావు తన కళాజీవితాన్ని భరత నాట్యంతో మొదలు పెట్టినప్పటికీ, ఆయన వేణువునే కాక, వాద్య బృంద నిర్వహణనూ, మెళుకు వలనూ, స్వరరచ ననూ, సంగీత ప్రసంగాలనూ అద్భుతంగా నిర్వహించాడు. తెలుగులో కవితలు అకాడమే కాదు, ఇంగ్లీషులో రచనలూ చేశాడు.

నరసరావుపేటలో చెరువు కట్ట మీద యాదవుల పిల్లలతో కూడి వారి వద్దనే వేణువు వాయించడం నేర్చుకున్న విజయ రాఘవరావుకు ప్రాథమికంగా గురువు ఎవరూ లేరు. మద్రాసు వెళ్ళి కళా క్షేత్రంలో సంగీతం, రుక్మిణీదేవి అరండేల్ వద్ద భరత నాట్యం అభ్యసించాడు. అక్కడికి వచ్చిన ప్రఖ్యాత నర్తకులు ఉదయ శంకర్ దృష్టిని ఆకర్షించి వారి నృత్య బృందంలో నర్తకుడిగా చేరి, దేశ విదేశాలూ తిరిగాడు. ఆ ప్రదర్శనలు ఇస్తున్నపుడే ఒకసారి రష్యాలో నాట్య ప్రదర్శన అనంతరం వేణు గానంతో అక్కడి శ్రోతల్ని అబ్బుర పరిచగా, ఆ సందర్భంలోనే ఉదయ శంకర్ సోదరుడు పండిట్ రవి శంకర్ తన శిష్యుడిగా స్వీకరించి హిందూస్తానీ సంగీత ప్రపంచం లోకి ఆయన్ని ఆహ్వానించాడు. అలా ఆయన ప్రతిభ మరింతగా విస్తరించింది.

సితార్ విద్వాంసుడైన రవిశంకర్ వద్ద సంగీతం నేర్చుకున్న విజయ రాఘవరావు ఆయనకు నికరమైన శిష్యుడు. రవిశంకర్ స్వయంగా సంగీతరచన చేసిన అనూరాధా, గోదాన్, మీరా మొదలైన హిందీ చిత్రాల రికార్డింగ్ లన్నిటిలోనూ రావు ప్రధానపాత్ర నిర్వహించాడు. ఫిల్మ్స్ డివిజన్‌వారి అసంఖ్యాకమైన డాక్యుమెంటరీల సంగీతం లో ఆయన రేడియో శబ్దాల దగ్గర్నుంచీ, రకరకాల ప్రపంచ వాద్యాల దాకా అనేకం వాడి విజయ వంతమైన ప్రయోగాలు చేశాడు. 1955 నుండి 1958 వరకు ఢిల్లీ ఆకాశవాణి కేంద్రంలో విజయ రాఘవరావు సంగీత ప్రయోక్తగా, వాద్యబృంద కార్యక్రమ సంవిధాన కర్తగా పనిచేశాడు.

గాంధీజీ హత్య జరిగినపుడు 'రఘుపతి రాఘవ రాజారాం' అనే గీతాన్ని శృతిలయ బద్ధంగా ఎడతెగకుండా వాద్యసంగీత రూపంగా ప్రసారం చేయించాడు. 24 గంటలు ఈ ప్రార్థన సందేశ గీతిక ప్రసార మవుతూనే ఉంది. దీనిని స్వరపరచినది రాఘవరావే. ఆ తరువాత మహాత్మాగాంధీ సంస్మరణ నివాళిగా ఇది సంప్రదాయ నిబద్ధమైంది.

1950 ప్రాంతాలలో సర్దార్ పటేల్ కొద్ది రోజులు తీవ్ర అనారోగ్యంతో బాధ పడుతుండేవారు. అప్పుడు వరసగా కొన్ని రోజులు తనను సంగీతంతో సేదదీర్చ వలసిందని పటేల్ విజయ రాఘవరావును కోరారు. సాయంకాలం ఒక గంట విజయ రాఘవరావు, ఉస్తాద్ అల్లారాఖా తబలా వాద్య సహ కారంతో పటేల్ మనస్సును స్వస్థ పరచేవారు, రంజింప జేసేవారు.అమెరికాలో వాషింగ్టన్, డి.సి.లో 'కార్నెజీ హాల్' అని అత్యంత ప్రతిష్ఠాత్మకమైన సభా భవనం ఉంది. ప్రపంచ ప్రసిద్ధులైన కళాకారుల గాన సభలు అక్కడ సంగీత కచేరీ నిర్వహించడం జీవిత సాఫల్యంగా భావిస్తారు. విజయ రాఘవరావు కార్నెజీ హాల్‌లో వారి ఆహ్వానంపై వేణునాదం విన్పించారు.

అమెరికాలో జార్జియా రాష్ట్రంలో భారతీయ సంగీతం, సంస్కృతి, జ్ఞాన సాధన, చింతన ధారలను ప్రచారం చేసే ఒక పత్రిక వెలువడు తున్నది. ముఖ్యంగా ప్రవాస భారతీయులను ఉద్దేశించి కార్యక్రమ నిర్వహణ విశేషాలను ప్రకటిస్తుంది ఈ పత్రిక. పన్నెండేళ్ళ కిందట 'అట్లాంటా' నగరంలో 'ఇండియన్ క్లాసికల్ మ్యూజిక్ సొసైటీ ఆఫ్ గ్రేటర్ అట్లాంటా అనే సాంస్కృతిక సంస్థ విజయ రాఘవరావు సంగీత కచేరీ ఏర్పాటు చేసింది. ఆయన గొప్ప నర్తకుడు కూడా. దేశవిదేశాలలో అనేక నృత్యప్రదర్శన లిచ్చాడు. పసిపిల్లల వంటి పరమ ఉల్లాస ప్రవృత్తి ఆయనది.సోనీ కంపెనీ వాళ్ళు విజయ రాఘవరావు హంసధ్వని గంటన్నర సేపు ఆలపించగా రికార్డు చేశారు. 'భువన్ షోమ్' కూడా నాకు వారు ప్రదర్శించి చూపారు. ఏల్చూరి విజయ రాఘవరావు ఇంగ్లీషులో, తెలుగులో కవిత్వం రాశాడు, కథలు రాశాడు. 1991 జనవరి- ఫిబ్రవరి ఇండియన్ లిటరేచర్ (సాహిత్య అకాడమి)లో ఆయన సాహిత్య ప్రస్థాన వ్యాసం ప్రచురితం. అందులో సంగీత సాహిత్యాలలో ఆయన ప్రజ్ఞ, హృదయ వైశాల్యం ఎంతో గొప్పగా ఆవిష్కృతమైనాయి.ఆయనకు 1970 లో భారత ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక అవార్డు అయిన పద్మశ్రీ వచ్చింది. 1982 లో సంగీత నాటక అకాడమీ అవార్డు లభించింది. జాతీయ అంతర్జాతీయ స్వర్ణ పతక సమ్మానితుడు గా సంగీత ప్రపంచం లో నిలిచి పోయాడు.



-రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

ఆపదలో ఉన్న మహిళకు అండగా నిలిచిన పోలీసులకు ఎస్పీ ప్రశంసలు

మానవత్వం, సేవాభావమే పోలీసుల అసలైన లక్షణాలు– ఎస్పీ మహేష్ బి గితే



రాజన్న సిరిసిల్ల, నవంబర్ 2 (నేటినిజం ప్రతినిధి): : విధి నిర్వహణలో నిబద్ధతతో పాటు ఆపదలో ఉన్న వారికి అండగా నిలవడం పోలీసుల బాధ్యత అని జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని మొదటి బైపాస్ రోడ్డుపై ఇటీవల ఫిట్స్‌తో అపస్మారక స్థితిలో పడిపోయిన మహిళకు తక్షణ సహాయం అందించిన బ్లూకోట్ కానిస్టేబుల్ ప్రశాంత్, హోంగార్డు శ్రీనివాస్ చారిలను సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ అభినందించారు. వారికి ప్రోత్సాహకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసుల విధులు శాంతిభద్రతల పరిరక్షణకే పరిమితం కావని, ఆపదలో ఉన్న ప్రజలకు సకాలంలో సహాయం అందించడం కూడా ముఖ్యమైన బాధ్యత అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ మానవత్వం, సేవాభావం, నిబద్ధతతో విధులు నిర్వహించాలని సూచించారు. సమయస్ఫూర్తితో స్పందించి ప్రజలకు మెరుగైన సేవలందించే సిబ్బందిని శాఖ ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తుందని తెలిపారు.

ప్రజావాణి అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి

జిల్లా అదనపు కలెక్టర్లు సి.హెచ్. మహేందర్ జి, ఎం. సంపత్ రావు.



ములుగు, నవంబర్ 2 (నేటినిజం ప్రతినిధి): ప్రజావాణిలో అందిన అర్జీలను పరిశీలించి, త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్లు సి.హెచ్. మహేందర్ జి, ఎం. సంపత్ రావు సంబంధిత శాఖల అధికారులకు సూచించారు.

సోమవారం ములుగు జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అర్జీదారులు తెలిపిన సమస్యలను విని, వారి దరఖాస్తులను పరిశీలించారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు మాట్లాడుతూ, ప్రజల సమస్యల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అర్జీలను సంబంధిత శాఖలవారీగా పరిశీలించి, నిబంధనల మేరకు పరిష్కార చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.

ప్రజావాణిలో మొత్తం 20 అర్జీలు అందాయి. వీటిలో భూ సమస్యలకు సంబంధించి 8, ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ఒకటి, ఇతర సమస్యలపై 11 అర్జీలు ఉన్నాయి.

ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

రుద్రవరంలో మృతుల కుటుంబాలకు ఏనుగు మనోహర్ రెడ్డి పరామర్శ



రాజన్న సిరిసిల్ల, నవంబర్ 2 (నేటినిజం ప్రతినిధి): వేములవాడ అర్బన్ మండలం రుద్రవరం గ్రామంలో ఇటీవల మృతి చెందిన బెజుగం లక్ష్మి, గాలిపెల్లి ఎల్లవ్వ, బండారు రాజేశ్వరి కుటుంబాలను బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సానుభూతి తెలియజేసి, మనోధైర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఊరడి సునీత-రాజిరెడ్డి, ఉపసర్పంచ్ బెజుగం మహేష్, కట్ట ఎల్లయ్య, పార్వతి అంజయ్య, పార్వతి కనకయ్య, ఎండీ బాషా, కూస రాజిరెడ్డి, పార్వతి అంజి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర హోంమంత్రి అమిత్ షా పాల్గొన్న ప్రజాస్వామ్య పరిరక్షణ మహాపాదయాత్రకు మద్దతుగా హైదరాబాద్‌కు తరలివెళ్లిన ములుగు జిల్లా బీజేపీ నాయకులు

కాంగ్రెస్ పార్టీ తప్పుడు ప్రచారాన్ని తిప్పికొడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణకు బీజేపీ శ్రేణుల సంఘీభావం



ములుగు, నవంబర్ 2 (నేటినిజం ప్రతినిధి): "ప్రజాస్వామ్యాన్ని రక్షిద్దాం ? అరాచకవాదాన్ని అంతం చేద్దాం" అనే నినాదంతో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రజాస్వామ్య పరిరక్షణ మహాపాదయాత్రకు మద్దతుగా ములుగు జిల్లా బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు.

కేంద్ర హోంమంత్రి శ్రీ అమిత్ షా పాల్గొన్న ఈ మహాపాదయాత్రకు సంఘీభావంగా ములుగు జిల్లా బీజేపీ అధ్యక్షులు సిరికొండ బలరాం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భూక్య జవహర్‌లాల్, భూక్య రాజునాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీలమంతుల రవీంద్రాచారి, జిల్లా నాయకులు అల్లె శోభన్, భర్తాపురం నరేష్, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు మాదరి శ్రీకాంత్, తాడ్వాయి మండల అధ్యక్షులు తాళ్లపల్లి లక్ష్మణ్, పర్రెంరఘు, రెడ్డి శ్రీను, వెంకటాపూర్ మండల బీజేవైఎం అధ్యక్షులు సోనా సింగ్ తదితర నాయకులు, కార్యకర్తలు ములుగు జిల్లా నుంచి హైదరాబాద్‌కు బయలుదేరి మహాపాదయాత్రలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా బీజేపీ ములుగు జిల్లా అధ్యక్షులు సిరికొండ బలరాం మాట్లాడుతూ, ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (సాఖీ) కార్యక్రమంపై కాంగ్రెస్ పార్టీ చేస్తున్న విమర్శలు, ఆరోపణలు ప్రజల్లో అనవసరమైన అపోహలు సృష్టించే విధంగా ఉన్నాయని అన్నారు. రాజ్యాంగబద్ధమైన ప్రజాస్వామ్య వ్యవస్థలు, ఎన్నికల ప్రక్రియ, న్యాయవ్యవస్థలపై కాంగ్రెస్ పార్టీ చేస్తున్న రాజకీయ విమర్శలను ప్రజల ముందు వాస్తవాలతో తిప్పికొట్టాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

ఓటరు జాబితాల ప్రక్షాళన అనేది ప్రజాస్వామ్య ఎన్నికల ప్రక్రియలో కీలకమైన అంశమని, ఈ ప్రక్రియపై ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రచారాన్ని వాస్తవాల ఆధారంగా ఎదుర్కోవాలని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలపై ప్రజలకు నమ్మకం కల్పించడంతో పాటు, రాజ్యాంగబద్ధ సంస్థల గౌరవాన్ని కాపాడటమే ఈ మహాపాదయాత్ర ప్రధాన ఉద్దేశమని తెలిపారు.కేంద్ర హోంమంత్రి శ్రీ అమిత్ షా పాల్గొన్న ఈ కార్యక్రమానికి మద్దతుగా ములుగు జిల్లా బీజేపీ నాయకులు, యువజన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లి తమ సంఘీభావాన్ని తెలియజేశారని సిరికొండ బలరాం తెలిపారు.

వివేకానంద హైస్కూల్‌లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలి

ఎంఇఓ గారికి వినతి పత్రం ఇచ్చిన బహుజన్ స్టూడెంట్ ఫెడరేషన్(బాఖ) జిల్లా అధ్యక్షుడు కాదపాక రాజశేఖర్ వర్మ

ములుగు, నవంబర్ 2 (నేటినిజం ప్రతినిధి): ఫైర్ సేఫ్టీ లేదు.. టెట్ అర్హత కలిగిన ఉపాధ్యాయులు లేరు.. మరుగుదొడ్లు, క్రీడా మైదానం కరువు వివేకానంద హైస్కూల్‌లో విద్యార్థులకు అవసరమైన కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంలో యాజమాన్యం నిర్లక్ష్యం వహిస్తోందని బిఎస్ఎఫ్ ఈ జిల్లా అధ్యక్షులు కడపాక రాజశేఖర్ వర్మ ఆరోపించారు×.పాఠశాలలో విద్యార్థుల భద్రతకు సంబంధించిన ఫైర్ సేఫ్టీ సదుపాయాలు లేకపోవడం ఆందోళనకరమని, విద్యార్థులకు విద్యాబోధన చేస్తున్న ఉపాధ్యాయుల్లో టెట్ అర్హత కలిగిన వారు లేరనే ఆరోపణలు ఉన్నాయని తెలిపారు.

తంగళ్ళపల్లి మండలంలో టీఆర్ఎస్ పార్టీలో భారీగా చేరికలు



రాజన్న సిరిసిల్ల, నవంబర్ 2 (నేటినిజం ప్రతినిధి): జిల్లాలోని తంగళ్ళపల్లి మండలంలోని రాళ్ల పేట గ్రామంలో సోమవారం టిఆర్ఎస్ నాయకులు గౌరు రాజశేఖర్ ఆధ్వర్యంలో 100 మంది టిఆర్ఎస్ పార్టీలో చేరగా సిరిసిల్ల అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జ్ మజీద్, నియోజకవర్గం నాయకులు అల్లె శంకర్, ముష్కం నందిని, చిన్ని బాల్ రెడ్డి, సయ్యద్ జావిద్, ఎల్లారెడ్డిపేట మండల అధ్యక్షులు కదిరే భాస్కర్ గౌడ్, కోశాధికారి బైరి రాజేష్ పార్టీ కండువాలు కప్పి టిఆర్ఎస్ లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిఆర్ఎస్ అధినేత కవితక్క ముఖ్యమంత్రి కావాలని టిఆర్ఎస్ పార్టీని తంగళ్ళపల్లి మండలంలో టిఆర్ఎస్ పార్టీని బలోపేతం చేస్తామని వాటిలో చేరిన వారు హామీ ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. కవితక్క తప్పకుండా ముఖ్యమంత్రి అవ్వడం ఖాయమని రాష్ట్ర ప్రజలు స్వచ్ఛందంగా పార్టీ బలోపేతానికి ముందుకు రావడం జరుగుతుందన్నారు. కవితక్క ప్రవేశపెట్టిన పాంచ జన్యం ఉచిత విద్య, ఉచిత వైద్యం, వ్యవసాయం రైతే రాజు, ఉపాధి ఉద్యోగాలు, సామాజిక న్యాయం అమలుచేసి రాష్ట్ర అభివృద్ధికి పాల్పడడం జరుగుతుందని, అందుకే రాష్ట్ర ప్రజలందరూ కవితక్కను ముఖ్యమంత్రి చేసుకునే వరకు కృషి చేయాలని కోరారు. కవితక్కను ముఖ్యమంత్రి చేయడానికి ముఖ్యంగా మహిళలు స్వచ్ఛందంగా ముందుకు రావడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తంగళ్లపల్లి నాయకులు రాచర్ల రాజు, గౌరు శ్రీనివాస్, ఇల్లందుల శ్రీనివాస్, అలుగునూరి బాలయ్య, ఇల్లందుల మల్లయ్య, మెతుకు లక్ష్మీనర్సవ్వ, ఇల్లందుల భాగ్య, మోహిని కనకవ్వ, మహేశ్వరి, సరిత, లక్ష్మి, శిరీషతో పాటు 100మంది పాల్గొన్నారు.

దీపావళి వేడుకలు ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా పటిష్ట ఏర్పాట్లు

బాణసంచా విక్రయ కేంద్రాలపై ప్రత్యేక నిఘా
అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి
జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్



అమరావతి, నవంబర్ 26 దీపావళి పండుగను జిల్లాలో ప్రశాంతంగా, సురక్షితంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహిం చేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ ఆదేశించారు. సోమవారం నిర్వహించిన పర్చువల్ సమన్వయ సమావేశంలో వివిధ శాఖల అధికారులకు పలు సూచనలు జారీ చేశారు.

ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ.. తాత్కాలిక బాణసంచా విక్రయ కేంద్రాలకు నిబంధనల ప్రకారం మాత్రమే లైసెన్సులు జారీ చేయాలని ఆదేశించారు. అమ్మకాలు ప్రారంభించే ముందే అన్ని విక్రయ కేంద్రాలను సంయుక్తంగా తనిఖీ చేసి, అగ్నిమాపక భద్రతా ప్రమాణాలు, లైసెన్స్ నిబంధనలు తప్పనిసరిగా పాటించేలా చూడాలన్నారు. అనధికారిక విక్రయాలు, నిల్వలపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రద్దీ ప్రాంతాలు, మార్కెట్లు, సున్నితమైన ప్రదేశాల్లో తగిన బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు నిరంతర గస్తీ నిర్వహించాలని పోలీసు అధికారులకు సూచించారు. అక్రమ బాణసంచా విక్రయాలు, నిల్వలు, వినియోగంపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు.

అగ్నిమాపక శాఖ అధికారులు ముందస్తుగా విక్రయ కేంద్రాలను తనిఖీ చేసి, అగ్ని ప్రమాద నివారణ ఏర్పాట్లను ధ్రువీకరించాలని జేసీ ఆదేశించారు. అవసరమైన ప్రాంతాల్లో అగ్నిమాపక వాహనాలు, పరికరాలు, సిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు. మున్సిపల్ కమిషనర్లు, పంచాయతీరాజ్ అధికారులు మార్కెట్ ప్రాంతాలు, ప్రజా ప్రదేశాల్లో పారిశుధ్యం, వీధి దీపాలు, తాగునీటి సౌకర్యాలు కల్పించాలని సూచించారు. బాణసంచా వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించేలా చర్యలు తీసుకోవాలన్నారు.ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అత్యవసర వైద్య సేవలు అందించేందుకు వైద్యులు, సిబ్బంది, మందులు, కాలిన గాయాల చికిత్సకు అవసరమైన సామగ్రిని సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. అంబులెన్సులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో పాఠశాలల్లో బాణసంచా వినియోగంపై భద్రతా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పెద్దల పర్యవేక్షణ లోనే బాణసంచా కాల్చాలని, ప్రమాదకరమైన పద్ధతులకు దూరంగా ఉండాలని ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు.రెవెన్యూ డివిజనల్ అధికారులు తమ పరిధిలోని ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించాలని, రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక, మున్సిపల్ శాఖల అధికారులు సంయుక్త తనిఖీలు నిర్వహించాలని జేసీ ఆదేశించారు. ఏదైనా అవాంఛనీయ సంఘటన చోటుచేసుకున్నా, ఏర్పాట్లలో లోపాలు గుర్తించినా వెంటనే జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకురావాలని, చేపట్టిన చర్యలపై నివేదిక సమర్పించాలని సూచించారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana. 'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93.
E-mail :netinijam93@gmail.com.